FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

TGTEL/25/A1964
తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :156 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ సోమవారం- 26 - జనవరి - 2026

# సింగిల్ నోడల్‘ ద్వారా రూ.5,929 కోట్ల నిధులివ్వండి



పోలవరం మూడో విడత అడ్వాన్సుపై కేంద్రానికి లేఖ

స్పర్శ్ తరహాలోకి మార్చి ఇస్తామన్న కేంద్రం

సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారానే కావాలన్న

రాష్ట్రం తాజాగా లేఖ, త్వరలో నిధుల విడుదల!

అమరావతి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం కేటాయించిన నిధుల్లో మూడో విడత అడ్వాన్సుగా సుమారు రూ.5,929 కోట్లు విడుదల చేయాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అధికారులు కేంద్రాన్ని కోరారు. ఈ అంశం ఆర్థిక శాఖ, కేంద్ర జలశక్తిల పరిశీలనలో ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో కేంద్రం ఇప్పటికే రెండు విడతలుగా దీనికి అడ్వాన్సు నిధులిచ్చింది. మిగతా..2లో

# యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాని ధ్యేయం




రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో యువకుడికి నియామక పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డీఐజీపీ ఉదయభాస్కర్ బిల్లా

కేశవగిరి, శామీర్‌పేట–: దేశంలోని యువతకు అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ హైదరాబాద్ మెన్స్‌క్లబ్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 213 మంది యువతీ, యువకులకు కిషన్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు నియామక పత్రాలు అందజేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా హాకీంపేటలోని జాతీయ పారిశ్రామిక భద్రతా శిక్షణ అకాడమీలో జరిగిన మరో మేళాలో మిగతా..2లో

## సింగరేణిలో రెండు స్కాంలనే బయటపెట్టా..



- సాధారణంగా టెండర్ షరతులు మార్చిస్తే అన్ని కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టాలని..
- వారి అభిప్రాయాలు తీసుకోవాలని.. మినిట్స్ నమోదు చేయాలని హరీశ్‌రావు తెలిపారు.
- కానీ ఇక్కడ అది జరగలేదని అన్నారు.. ఈ తతంగం వెనుక ఏం జరిగింది మీటింగ్ మినిట్స్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్: సింగరేణిలో ఒకటి.. రెండు కాదు.. పదుల సంఖ్యలో స్కాములు జరిగాయని తెలిపారు. మిగతా..2లో

## నాంపల్లి అగ్నిప్రమాదం కేసు..
# ఫర్నిచర్ షాపు యజమాని అరెస్ట్

- బచ్చాస్ ఫర్నిచర్ షాపు కేసుకు సంబంధించి షాపు యజమాని సతీష్ బచాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.
- నిబంధనలకు విరుద్ధంగా సతీష్.. సెల్లార్‌లో ఫర్నిచర్ షాపు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.



హైదరాబాద్, జనవరి 25: నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో నిన్న (శనివారం) అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. నాలుగు అంతస్తుల భవనంలోని సెల్లార్‌లో ఉన్న ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. దుకాణంలో పని చేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్, శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్‌లతోపాటు సెల్లార్‌లో చిక్కుకున్న ప్రవీణ్, అఖిల్, బీబీలు మృత్యువాతపడ్డారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫర్నిచర్ షాపు యజమాని సతీష్ బచాస్‌ను అరెస్ట్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సతీష్ సెల్లార్‌లో ఫర్నిచర్ షాపు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సతీష్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. నిందితుడిని అబిడ్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ అనే ఐదంతస్తుల భవనం ఉంది. భవనం సెల్లార్‌లో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. దుకాణంలో సుమారు 22మంది పని చేస్తున్నారు. యాదయ్య అనే వ్యక్తి వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ప్రణీత్(11), అఖిల్(7)తో కలిసి సెల్లార్‌లోనే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. ఫర్నిచర్‌ను రెండు సెల్లార్లలో భద్రపరిచారు. శనివారం ప్రణీత్, అఖిల్‌లు స్కూలుకు వెళ్లకుండా ఇంటిలోనే ఉండిపోయారు. తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళుతూ.. మిగతా..2లో

# టెండర్లపై విచారణకు సిద్ధం



2లో

హరీశ్‌రావు లేఖ రాస్తే 2014 నుంచి ఇప్పటిదాకా

సింగరేణి కాంట్రాక్టులపై సిట్ దర్యాప్తు చేయిస్తా

సైట్ విజిట్ నిబంధన భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది

సృజన్‌రెడ్డి భారాస మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డికి అల్లుడు

ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఏం సంబంధం

సైట్ విజిట్ నిబంధన పెట్టాలని సెంట్రల్ మైన్స్ ప్లానింగ్ సంస్థ ఇచ్చిన మార్గదర్శకాలను మీడియాకు చూపుతున్న భట్టి

హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సింగరేణి సంస్థలో టెండర్ల కేటాయింపులన్నింటిపై విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హరీశ్‌రావు తనకు లేఖ రాస్తే అవసరమైతే సిట్ వేసి విచారణ చేయిస్తానని స్పష్టం చేశారు. ‘సింగరేణి టెండర్ల కేటాయింపుల్లో సైట్ విజిట్ సర్టిఫికెట్ దాఖలు చేయాలనే నిబంధన పెట్టి

## 2026 పోల్స్ కేవలం ఎన్నికలు కాదు- ప్రజాస్వామ్య యుద్ధం


2

- మహాబలిపురంలో టీవీకే విజయ్ పార్టీ మీటింగ్
- అధికార పార్టీపై కీలక వ్యాఖ్యలు చేసిన విజయ్

తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కేవలం పోటీగా కాకుండా అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య యుద్ధంగా అభివర్ణించారు టీవీకే విజయ్. ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, దేనికీ రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా, డీఎంకే పరోక్షంగా బీజేపీకి సరెండర్ అయ్యాయని విమర్శించారు. తమిళనాడులో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఆదివారం మహాబలిపురంలో నిర్వహించిన సభలో విజయ్ మాట్లాడుతూ

## మోదీని ఆకట్టుకున్న యూఏఈ
# ‘ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ‘ కాన్సెప్ట్

- యూఏఈ ‘ఫ్యామిలీ ఇయర్‘ కార్యక్రమాన్ని ప్రశంసించిన ప్రధాని మోదీ
- ఇది భారత కుటుంబ వ్యవస్థతో సమానమని వ్యాఖ్య
- మన్ కీ బాత్‌లో గుజరాత్‌లోని చందంకి గ్రామ ప్రస్తావన
- గ్రామంలోని సామూహిక వంటగది వల్లే ఇళ్లలో వంట చేయరని వెల్లడి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) చేపట్టిన ‘ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ‘ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఇది భారతీయ కుటుంబ విలువలకు అద్దం పడుతోందని, కుటుంబ బంధాలను బలోపేతం చేసే గొప్ప చొరవ అని కొనియాడారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్‘లో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కుటుంబ వ్యవస్థలకు లభిస్తున్న గౌరవాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని గుజరాత్‌లోని చందంకి గ్రామంలో ఉన్న ఓ ప్రత్యేక సంప్రదాయాన్ని ఉదహరించారు. ఆ గ్రామంలోని ప్రజలు, ముఖ్యంగా పెద్దవారు తమ ఇళ్లలో వంట చేయరని, గ్రామంలోని సామూహిక వంటశాల (కమ్యూనిటీ కిచెన్) ద్వారా అందరూ కలిసి భోజనం చేస్తారని వివరించారు. మిగతా..2లో

# ఓటర్ల దినోత్సవమే నాటకం
## ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న

- జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్‌పై మమతా ఫైర్
- బీజేపీ తరఫున పనిచేస్తున్న ఈసీ అంటూ ఘాటు ఆరోపణలు
- ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తూ ప్రజాస్వామ్య పునాదులు ధ్వంసం చేస్తున్నారన్న వ్యాఖ్యలు


వివరాలు 2లో..

జాతీయ ఓటర్ల దినోత్సవం వేళ ఎన్నికల కమిషన్ తీరుపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తూ, భారత ప్రజాస్వామ్యానికి పునాదులే ధ్వంసం చేస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్ మారిందని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారమంతా బీజేపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందని మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### ధైర్యం చేస్తోందా: మమత

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ‘దారుణమైన నాటకంగా అభివర్ణించిన ఆమె, ఈ సందర్భంలోనే ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. “బీజేపీ అనే తమ మాస్టర్ తరఫున ప్రతిపక్షాలను నలిపేస్తూ, భారత ప్రజాస్వామ్యానికి పునాదులే కూల్చేస్తున్న ఎన్నికల కమిషన్, ఇంకా ఓటర్ల దినోత్సవం జరుపుకోవడానికి ధైర్యం చేస్తోందా?“ అంటూ ప్రశ్నించారు.

## ప్రభుత్వ ధనం ప్రజలదని, స్వీకరించనని స్పష్టీకరణ


2

- ప్రభుత్వ జీతం నాకు వద్దు.. ఒక్క రూపాయి కూడా తీసుకోను
- ఏపీ ప్రభుత్వ యోగా, నేచురోపతి సలహాదారుగా నియమితులైన మంతెన
- క్యాబినెట్ హోదా ఉన్నా జీతం, సౌకర్యాలు తీసుకోబోనని ప్రకటన
- సీఎం చంద్రబాబు ముందు కఠిన నిబంధనలు పెట్టిన మంతెన సత్యనారాయణ రాజు
- నిస్వార్థ సేవ చేయాలన్న మంతెన నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు

## ఈ పురస్కారాలు రాబోయే తరాలకు
# గొప్ప స్ఫూర్తినిస్తాయి

- తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలు
- విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విభిన్న రంగాల్లోని ప్రతిభకు గుర్తింపు రావడం గర్వకారణమన్న కేటీఆర్
- క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని గుర్తించడం అభినందనీయం అని ప్రశంస
- మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ రావడంపై హర్షం



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల్లో తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హర్షం వ్యక్తం చేశారు.

## ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం



2లో

★ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలపై టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు భేటీ

★ అమరావతికి రెండో విడత నిధులు, పోలవరం పూర్తికి సహకారం కోరాలని సూచన

★ కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం.. ఏపీకి నిధులు రాబట్టాలని ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

★ విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపు

## మొదటి పేజి తరువాయి

## సింగిల్ నోడల్' ద్వారా రూ.5,929 కోట్ల నిధులివ్వండి

## పోలవరం మూడో విడత అడ్వాన్సుపై కేంద్రానికి లేఖ

వీటిలో రాష్ట్రం 80 శాతానికి పైగా ఖర్చు చేసింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మూడో విడత ఇవ్వాలంటు కూడా లేఖ రాసింది. ఈ నిధులిచ్చే విధానాన్ని మార్చాలని కేంద్ర అధికారులు మొదట భావించారు. ప్రస్తుతం ఆ విధానం మారిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, ఇప్పటి వరకు ఇస్తున్న సింగిల్ నోడల్ ఖాతా విధానాన్నే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు దీనిపై తాజాగా లేఖ రాశారు. దీంతో మూడో విడత అడ్వాన్సు నిధులు కూడా కేంద్రం నుంచి రానున్నాయి. 'సింగిల్ నోడల్' కాకుంటే ఇబ్బంది : రెండు విధానాల్లో (స్పర్శ్ విధానం, సింగిల్ నోడల్ ఏజెన్సీ) కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఆర్థికశాఖ, నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టుకు సింగిల్ నోడల్ ఖాతా విధానంలోనే నిధులిచ్చింది. ఇప్పుడు మాత్రం దీన్ని మార్చి స్పర్శ్ నమూనాలో విడుదల చేస్తామని పేర్కొంది. ఇందుకు పోలవరం, రాష్ట్ర ఆర్థిక శాఖకు సంబంధించిన అధికారులు సమ్మతించలేదు. ఈ సంవత్సరం జూన్ వరకు పోలవరంలో పనులు ముమ్మరంగా సాగనున్నాయని, నిధులు అత్యవసరమని కేంద్రానికి జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ శనివారం(24-01-26)వ తేదీన లేఖ రాశారు. ఇప్పుడు స్పర్శ్ విధానానికి మారిస్తే ఆ విధివిధానాలన్నీ పూర్తి చేసేందుకు మరింత సమయం పడుతుందని, అవసరమైనప్పుడు నిధుల లభ్యత లేకుండా పోతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఏమిటీ సింగిల్ నోడల్ ఏజెన్సీ విధానం : ఈ విధానంలో కేంద్రం మొదట అవసరమైన నిధులు కేటాయించి, ఆ తర్వాత వాటిని రాష్ట్రానికి విడుదల చేస్తుంది. ఈ పథకం అమలు చేసే ఏజెన్సీ సింగిల్ నోడల్ ఖాతాను, జీరో బ్యాలెన్సు నిధులతో నిర్వహిస్తుంది. ఎప్పుడు బిల్లు చెల్లించాల్సి వస్తే అప్పుడు ఆ ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులను విడుదల చేస్తుంది. బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత చేసిన పనికి బిల్లులను సమర్పిస్తారు. ఆ ప్రక్రియ అనంతరం అప్పుడు ఆ పథకం నిర్వహించే మేనేజర్ సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు నిధులు విడుదల చేస్తారు. స్పర్శ్ విధానంలో ఇలా : తాజాగా స్పర్శ్ విధానంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు నిధులిస్తోంది. ఇందులో ఒకేసారి సంబంధిత పథకం అమలు చేసే ప్రభుత్వ శాఖకు కేంద్ర, రాష్ట్ర వాటా నిధులు కూడా చేరతాయి. ఆ ప్రభుత్వ శాఖే సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు సంబంధిత నిధులు పంపిణీ చేస్తుంది.

## మోదీని ఆకట్టుకున్న యూఏఈ 'ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ' కాన్సెప్ట్

ఈ విధానం ప్రజల మధ్య ఐక్యతను, కుటుంబ భావనను పెంపొందిస్తోందని మోదీ అన్నారు. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్‌తో జరిగిన సంభాషణను ప్రధాని గుర్తు చేసుకున్నారు. 2026వ సంవత్సరాన్ని యూఏఈ 'ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ'గా ప్రకటించిందని ఆయన తనతో చెప్పినట్లు మోదీ తెలిపారు. ప్రజల మధ్య సామరస్యం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని యూఏఈ అధ్యక్షుడు వివరించినట్లు పేర్కొన్నారు. యూఏఈ చేపట్టిన ఈ కార్యక్రమం నిజంగా ప్రశంసనీయమని మోదీ పేర్కొన్నారు. ఇటువంటి సామాజిక, సాంస్కృతిక విలువలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరగడం భారత్-యూఏఈ బలమైన సంబంధాలకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

### 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన యూఏఈ.. కుటుంబ బంధాలే దేశానికి పునాది

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరాన్ని 'కుటుంబ సంవత్సరం' (ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ)గా పాటిస్తున్నట్లు యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్ ప్రకటించారు. అబుదాబిలో జరిగిన 2025 వార్షిక ప్రభుత్వ సమావేశాల సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. దేశ భవిష్యత్తు, సుస్థిరతకు కుటుంబ వ్యవస్థే పునాది అని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోందని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. ఎమిరేటీ కుటుంబాల శ్రేయస్సు, స్థిరత్వం, బలోపేతమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధ్యక్షుడు స్పష్టం చేశారు. బలమైన, సుస్థిరమైన కుటుంబాలే దేశ దీర్ఘకాలిక ప్రగతికి ఆధారం అని, కుటుంబ వృద్ధి జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన పేర్కొన్నారు. దేశ జాతీయ గుర్తింపు, భద్రత, సమృద్ధిలో కుటుంబ శ్రేయస్సు అంతర్భాగమని నొక్కిచెప్పారు. ఐక్యత, సహకారం, సానుభూతి వంటి విలువలను ప్రోత్సహించి, వాటిని భవిష్యత్ తరాలకు అందించడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యాల్లో ఒకటి.

## ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం

అమరావతి : త్వరలో జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రానికి అత్యధికంగా కేంద్ర నిధులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీలకు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. ముఖ్యంగా అమరావతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రెండో విడత నిధులు, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇప్పటికే అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో కూడా ఇదే తరహా సాయం కోరుతున్నాం" అని పేర్కొన్నారు. అలాగే, "పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాము. ఆ దిశగా కేంద్రం కూడా సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధిక నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎంపీలందరూ చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో, బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వాణిని బలంగా వినిపించేందుకు టీడీపీ ఎంపీలు సిద్ధమవుతున్నారు.

## సింగరేణిలో రెండు స్కాంలనే బయటపెట్టా..

నేను ఇప్పటికి ఓబీ స్కాం, సోలార్ స్కాం మాత్రమే చెప్పాను. సింగరేణిలో ఇంకా అనేక స్కాములు ఉన్నాయని అన్నారు. ఈ కుంభకోణంలో కింగ్ పిన్ ఏ హోటల్లో మీటింగ్ పెట్టాడు? ముఖ్యమంత్రి బంధువు కూడా ఆ హోటల్లో కూర్చున్న ఫోటోలు మా దగ్గర ఉన్నాయని.. వాటిని టైం వచ్చినప్పుడు బయట పెడతామని తెలిపారు. డీజిల్‌ను కాంట్రాక్టర్ల పరిధిలోకి తెచ్చిన తర్వాత టర్నోవర్ అర్హత పెంచి 20 ఏళ్ల అనుభవం ఉన్న స్థానిక కాంట్రాక్టర్లను పక్కన పెట్టారని హరీశ్‌రావు తెలిపారు. ఇక నుంచి డీజిల్ కాంట్రాక్టర్ల పరిధిలోనే ఉంటే, ఉన్న కాంట్రాక్టర్లు స్వయంగా డీజిల్ కొనుగోలు చేసుకునే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మీ స్వార్థం కోసం మైనింగ్ అనుభవం లేని కొత్త కాంట్రాక్టర్లకు దారులు తెరిచారని అన్నారు. మేము బొగ్గు స్కాం అని భయపెట్టగానే నాలుగు పేపర్లు పట్టుకొని వచ్చి, మీడియాని సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన భట్టి గారు.. నేను బయటపెట్టిన సోలార్ స్కామ్, పేలుడు పదార్థాల స్కామ్, ఉద్యోగుల డీప్రొమోషన్ వంటి కీలక అంశాలపై ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. సింగరేణిలో ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో స్కాములు జరిగిందన్నది వాస్తవం కాబట్టి ఆయన సైలెంట్‌గా ఉన్నారని అన్నారు. అడ్డగోలుగా నిబంధనలు మార్చి, రేవంత్ రెడ్డి బావమరిదికి, ఇతర అనుయాయులకు టెండర్లు కట్టబెట్టింది నిజమని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో స్కీములు రాలేదు గానీ పదుల సంఖ్యలో స్కాంలు మాత్రం వచ్చాయని ఎద్దేవా చేశారు.

## నాంపల్లి అగ్నిప్రమాదం కేసు..

## ఫర్నిచర్ షాపు యజమాని అరెస్ట్

సెల్లార్‌లోనే ఆడుకోమని వారికి చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పొగలు రావటం గమనించిన కొంతమంది ఫర్నిచర్ షాపు సిబ్బంది బయటకు పరుగులు తీశారు. మహ్మద్ ఇంతియాజ్, సయ్యద్ హబీబ్, బీబీ అనే వృద్ధురాలు లోపల చిక్కుకుపోయారు. బీబీని కాపాడ్డానికి ప్రణీత్, అఖిల్ లోపలికి వెళ్లారు. మళ్లీ తిరిగిరాలేదు. మంటల్లో కాలి ఐదుగురు చనిపోయారు.

## యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాని ధ్యేయం

238 మందికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నియామక పత్రాలు అందించారు. చాంద్రాయణగుట్టలో జరిగిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ఈరోజు దేశవ్యాప్తంగా 45 కేంద్రాల్లో రోజ్‌గార్ మేళాలను నిర్వహించి 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం విశేషమన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 1.50 లక్షల స్టార్టప్ కంపెనీలతో కేంద్రం ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. 2030 నాటికి రక్షణ పరికరాల దిగుమతులు తగ్గించి దేశంలోనే తయారుచేసేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని భారీ తెరపై వీక్షించారు. సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ ఐజీ(మెడికల్) డాక్టర్ గణేశ్ చంద్ర పథీ, సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ డీఐజీపీ ఉదయభాస్కర్ బిల్లా తదితరులు పాల్గొన్నారు. హకీంపేట నీసాలో యువతికి నియామకపత్రం ఇస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, చిత్రంలో నీసా డైరెక్టర్ డీపీ పరిహార్, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌దాము

### ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులేవీ: సంజయ్

'ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అందరికీ తెలుసు. సిట్ విచారణకు నన్ను పిలిచి నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అధికారులు చెప్పారు.. ఇందుకు బాధ్యులెవరో తెలుసు.. ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్టు చేయలేదు.. ఎందుకంటే ఏఐసీసీకి ఫామ్‌హౌస్‌కు డీల్ కుదరలేదు' అని కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఆరోపించారు. హకీంపేటలో జరిగిన మేళాలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాలు పొందినవారు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా చేయాలని పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇచ్చిందో తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను దోషిలా పిలిచారా? లేక వాంగ్మూలం సేకరించారా అని ప్రశ్నించారు. సమావేశంలో నీసా డైరెక్టర్ డీపీ పరిహార్, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌దాము, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు.

## నా 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదు' - జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు

### మొదటి పేజి తరువాయి

అని వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.చిత్తూరు జిల్లా నగరిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో శనివారం(24 -01-26)వ తేదీన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఘనవ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆయన ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు. హరిత రాయబారులు రాజేంద్రన్, నారాయణమ్మ, మురుగమ్మ, పార్వతి, నాగరాజులను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆయన షెడ్యూల్‌లో ఉన్న నగరి ప్రాంతీయాసుపత్రి పర్యటనను సీఎం రద్దు చేసుకున్నారు.ఎక్కువ సంతానముంటేనే ఎన్నికల్లో పోటీ : దేశవ్యాప్తంగా భూగర్భజలాల నాణ్యత గురించి తాజాగా ఓ నివేదిక వచ్చింది. రాష్ట్రంలో ఉన్న భూముల్లో 9.8 శాతం లవణీయత, 8.99 శాతం ఫ్లోరైడ్, 24 శాతం నైట్రోజన్ ఉన్నాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. యూరియా, రసాయన ఎరువులతోనే దేశానికి ఈ పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. దీన్ని అరికట్టేందుకు ఓ పాలసీ తెస్తానని తెలిపారు. జనాభా పెరుగుదలకు మరో పాలసీ అమలుచేస్తానని ఆయన తెలిపారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయలేరనే నిబంధన తెచ్చానని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఒకరి కంటే ఎక్కువమంది పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుందని అని సీఎం చంద్రబాబు తెలిపారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని ఆగదు : 'జగన్ అమరావతిపై మూడు ముక్కలాట ఆడారు. ఇప్పుడు కూడా అడ్డుకుంటామని అంటున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని మాత్రం ఆగదు. గతంలో దాదాపు రూ.32వేల కోట్ల మేర విద్యుత్తు భారాన్ని మోపారు. సుమారు రూ.1.20 లక్షల కోట్ల వరకు అప్పుచేశారు. గతంలో విధించిన దాదాపు రూ.4,600 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటికే యూనిట్‌కు 39 పైసలు వరకు తగ్గించాం. కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యుత్తు ఛార్జీలను పెంచదు. ఇప్పుడు రాష్ట్రంలో గంజాయి సాగు కూడా లేదు. ఈగల్‌తో దాని మీద ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రభుత్వోద్యోగులకు పెట్టిన సుమారు రూ.25వేల కోట్ల బకాయిలను విడతలవారీగా చెల్లిస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.స్వచ్ఛాంధ్ర జీవనవిధానంలో భాగం కావాలి : స్వచ్ఛాంధ్ర మన అందరి జీవనవిధానం కావాలి. ప్రతి మూడో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చంద్రబాబు తెలిపారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు అన్నీ వస్తే ప్రజలకు ఇంక డంపింగ్ యార్డుల సమస్య ఉండదని అన్నారు. 2026 మార్చి నెల నాటికి దాదాపు 10 లక్షల కుటుంబాలు సేంద్రియ వ్యర్థాల నిర్వహణను పాటించేలా ప్రోత్సహిస్తానని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖమంత్రిగా పవన్‌కల్యాణ్ ఉన్నారని వెల్లడించారు. నాలుగేళ్లలో దాదాపు 26వేల కిలోమీటర్ల డ్రెయిన్లను నిర్మిస్తామని చంద్రబాబు తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రోడ్లు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అభివృద్ధి చేస్తాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.బంగారు కుటుంబాలైన ధనలక్ష్మి, గణేష్‌లను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చిన ధనంజయరాజు, సాయికుమార్‌లను ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. డిగ్రీ చదివి ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న గణేష్‌కు ఐటీ ఉద్యోగి సాయికుమార్ తన సంస్థలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం ఇవ్వడంతోపాటు కంపెనీలో భాగస్వామ్యం ఇస్తానని చెప్పడం ఎంతో అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాశ్, మురళీ మోహన్, థామస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.ఎక్కువగా ఎందుకు ఖర్చు చేయడం లేదు : సేంద్రియ వ్యవసాయం గురించి వ్యవసాయశాఖ అధికారులు సీఎంకు వివరిస్తుండగా ఆయన కొన్ని ప్రశ్నలు అడగ్గా వారు దానికి సరైన సమాధానం ఇవ్వలేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కేంద్రం ఇచ్చిన నిధులు ఎక్కువగా ఎందుకు ఖర్చు చేయడంలేదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పట్టాభిని ఉద్దేశించి మాటలకు పరిమితం కాకుండా అమలుపై దృష్టిసారించాలన్నారు. అప్పుడే సరైన నాయకులు అవుతారని చంద్రబాబు సూచించారు. నేను చేసిందే నాకు ఉపన్యసిస్తున్నారంటూ ఆయన చురకలు అంటించారు.

రెండేళ్లలో నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళ్లు :

"2028వ సంవత్సరం నాటికి నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళ్లు.. నేను తరచూ దావోస్ వెళ్లి రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నా. సుమారు 18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25% మన రాష్ట్రానికే వచ్చాయి. త్వరలో ఏఐ డాక్టర్ కూడా వస్తాడు. సంజీవని ప్రాజెక్టుతో మీ అందరి ఆరోగ్యాన్ని కాపాడతా. దాదాపు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతిసేద్యం చేస్తున్న రాష్ట్రం మనది ఒక్కటే"

## ఓటర్ల దినోత్సవమే నాటకం- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న ఈసీ'

### మొదటి పేజి తరువాయి

ఎన్నికల కమిషన్ ప్రస్తుతం హిస్ మాస్టర్స్ వాయిస్ లా వ్యవహరిస్తోందని, ప్రజల ఓటు హక్కులను లాక్కునే పనిలో బిజీగా ఉందని మమతా ఆరోపించారు. "ప్రజల ఓటు హక్కులను హరిస్తూనే, ఓటర్ల దినోత్సవం అంటూ వేడుకలు జరపడం నిజంగా బాధాకరం. ఈ సంస్థ ప్రవర్తన నాకు తీవ్రంగా కలిచివేస్తోంది" అని ఆమె పేర్కొన్నారు.

#### ప్రజలను వేధిస్తున్నారు!

ప్రత్యేకంగా బంగాల్ లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాల సవరణను అత్యంత తొందరపాటు చర్యగా చేపడుతున్నారని, దీని వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని మమతా ఆరోపించారు. ప్రజల పేర్లు తొలగించడం, అనవసరమైన సాంకేతిక కారణాలు చూపిస్తూ ఓటు హక్కును నిరాకరించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోపాల పేరుతో కొత్త కొత్త కారణాలు వెతుక్కుంటూ ప్రజలను వేధిస్తున్నారు. వారి ఎన్నికల హక్కులను హరించడమే లక్ష్యంగా ఈ చర్యలు సాగుతున్నాయి" అని ఆమె ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైన ఓటు హక్కును కాపాడాల్సిన సంస్థే, అదే హక్కును కాలరాస్తోందని ఆమె విమర్శించారు. ఇటీవల కాలంలో ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బెంగాల్‌లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మమతా చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం అది కేంద్రంలోని అధికార పార్టీ ప్రభావానికి లోనైందన్న ఆరోపణలను మమతా మరింత బలంగా వినిపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా కమిషన్ వ్యవహరిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

#### ఓటు హక్కులను కాలరాస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్!

జాతీయ ఓటర్ల దినోత్సవం అనేది ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచేందుకు, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి నిర్వహించే కార్యక్రమమని గుర్తు చేశారు. అలాంటి రోజునే ఓటు హక్కులను కాలరాస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్ మారిందని ఆమె వ్యాఖ్యానించారు. మమతా వ్యాఖ్యలపై ఎన్నికల



కమిషన్ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన రాలేదు. అయితే ఈ వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, అలాగే ప్రతిపక్షాల మధ్య ఈ అంశంపై వాదనలు కొనసాగనున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మమతా చేసిన ఆరోపణలు రాబోయే ఎన్నికల ముందు రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేసే అవకాశం ఉందని అంటున్నారు.

## 2026 పోల్స్ కేవలం ఎన్నికలు కాదు- ప్రజాస్వామ్య యుద్ధం

### మొదటి పేజి తరువాయి



ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు జరగబోయయేది కేవలం ఎన్నిక కాదు. ఒక ప్రజాస్వామ్య యుద్ధం. దీనికి నాయకత్వం వహించబోయే సేనాపతులు మీరే. ప్రస్తుతం అధికారంలో ఉన్న దుష్టశక్తిని, గతంలో రాష్ట్రాన్ని పాలించిన అవినీతి శక్తిని ఎదుర్కొనే ధైర్యం, ధృఢ సంకల్పం కేవలం టీవీకేకు మాత్రమే ఉంది. ఏ దుష్ట లేదా అవినీతి శక్తి రెండు తమిళనాడును పాలించకూడదు. అలాంటి పార్టీలను నిజంగా ధైర్యంగా వ్యతిరేకించే ధైర్యం, ధృఢ సంకల్పం కేవలం మాకు మాత్రమే ఉంది. ప్రజలను రక్షించడానికి, హాని తలపెట్టే వారి నుంచి ఈ నేలను కాపాడానికి మేం ఇక్కడ ఉన్నాం. అంతేకాకుండా రాజకీయ నిజాయితీకి కట్టుబడి ఉంటాం. మేం ఎవరి కోసమో లేదా దేనికోసమో ఎప్పటికీ రాజీ పడం' అని విజయ్ అన్నారు. ఎన్నికలు, పొత్తుల గురించి చాలా అంచనాలు వేస్తున్నారని, తనని కూడా తక్కువ చేసి మాట్లాడతున్నారని విజయ్ తెలిపారు. 'మా కోసం ఎవరూ నిలబడరని చెబుతున్నారు. ఇది మాకు కొత్త కాదు. గత 30 సంవత్సరాలుగా ఈ పార్టీలు మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారు. కానీ ప్రజలు మమ్మల్ని స్పష్టంగా, నిర్ణయాత్మకంగా అంచనా వేశారు. దేశం దీనిని గమనిస్తోంది. ప్రజలు నాపైనే కాకుండా, నా చుట్టూ ఉన్నవారిపై కూడా నమ్మకం ఉంచాలి. ఈ నమ్మకం లేదని నేను చెప్పడం లేదు, కానీ మనం ఆ దిశగా ప్రవర్తించాలి, పని చేయాలి. ఎవరి కోసమో రాజీ పడకూడదు. మనం ఐక్యంగా ఉండాలి. మీలో ప్రతి ఒక్కరూ నాకు ముఖ్యమైనవారే. మీరే ముందుండి పోరాడే యోధులు' అని విజయ్ పేర్కొన్నారు.

అధికార, ప్రతిపక్షంపై విజయ్ విమర్శలు

అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలను విజయ్ తీవ్రంగా విమర్శించారు. ఈ రెండు పార్టీ తమ వైఖరితో రాజీపడ్డాయని ఆరోపించారు. తమిళనాడులో గతంలో, ఇప్పుడు పాలిస్తున్న వారు బీజేపీకి బానిసలని విజయ్ విమర్శించారు. వారు తమ వేషధారణ కోల్పోకుండా ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. అన్నాండీఎంకే ప్రత్యక్షంగా, డీఎంకే పరోక్షంగా పొత్తు పెట్టుకుందని అన్నారు. ఇదే ప్రజల్లో నిరాశను సృష్టించిందని అన్నారు. కానీ ప్రజలు టీవీకే విశ్వాసం చూపించారని, పార్టీకి హృదయపూర్వకంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే స్థానాన్ని ప్రజలు సరిగ్గా అర్థం చేసుకున్నారని అన్నారు.

ప్రభుత్వ ధనం ప్రజలదని, దాన్ని స్వీకరించనని స్పష్టీకరణ

అమరావతి : ప్రముఖ యోగా, ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తన ప్రభుత్వ పదవికి సంబంధించి ఒక ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారుగా నియమితులైన ఆయన, క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి జీతభత్యాలు గానీ, ఇతర సౌకర్యాలు గానీ స్వీకరించబోనని స్పష్టం చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో సీఎం చంద్రబాబు.. మంతెన సత్యనారాయణ రాజును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న 'సంజీవని' వంటి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు ఆయన సలహాలు తీసుకోవాలని సీఎం భావించారు. ఈ నేపథ్యంలో మంతెనతో సీఎం చంద్రబాబు దాదాపు 20 నిమిషాల పాటు చర్చించి, పదవిని చేపట్టాలని కోరారు. అయితే, ఈ పదవిని స్వీకరించడానికి తాను మొదట విముఖత చూపినట్లు మంతెన తెలిపారు. కేవలం తెరవెనుక ఉండి సలహాలు ఇస్తానని చెప్పగా, అధికారిక హోదా ఉంటేనే సూచనలకు విలువ ఉంటుందని, పనులు వేగంగా జరుగుతాయని సీఎం చంద్రబాబు నచ్చజెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కోరికను కాదనలేక పదవిని స్వీకరించడానికి అంగీకరించినప్పటికీ, తాను కొన్ని కఠినమైన షరతులు విధించినట్లు మంతెన పేర్కొన్నారు. "నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా జీతంగా తీసుకోను. ప్రభుత్వ వాహనం సహా ఎలాంటి సౌకర్యాలు వినియోగించుకోను. ఈ నిబంధనలకు అంగీకరిస్తేనే బాధ్యతలు చేపడతాను" అని సీఎంకు తేల్చిచెప్పగా, ఆయన అందుకు సమ్మతించారని మంతెన వెల్లడించారు. గత 35 ఏళ్లుగా తన పుస్తకాలపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నానని, తాను నిర్వహిస్తున్న ఆశ్రమం నుంచి కూడా జీతం తీసుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధనం ప్రజలదేనని, దానిని స్వీకరించకూడదనేది తన జీవిత నియమమని ఆయన అన్నారు.

## టెండర్లపై విచారణకు సిద్ధం

### మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ వాళ్లు దోచుకుతిన్నారని హరీశ్‌రావు అంటున్నారు. ఈ నిబంధన 2018 నుంచి ఉంది. భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది' అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో 5 టెండర్లు కేటాయించగా వాటిలో 4 భారాస నాయకుల కంపెనీలకే వచ్చినట్లు ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలసి శనివారం ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "సింగరేణి టెండర్లపై విచారణ చేయాలని హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాయడం ఎందుకు? 2014 నుంచి నేటి వరకు అన్నింటిపై విచారణ చేయాలని నాకు లేఖ రాస్తే సరిపోతుంది. అలా రాస్తే సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన నుంచి రాగానే నేను వెళ్లి చెప్పి విచారణ చేయించేందుకు ఒప్పిస్తా. తెలంగాణ వచ్చాక గనులలో మట్టి(ఓవర్ బర్డెన్- ఓబీ) తొలగింపు పనుల టెండర్లను సింగరేణి భారాస పాలనలో 20, కాంగ్రెస్ పాలనలో 5 కేటాయించింది.

ఇతర రాష్ట్రాల సంస్థల టెండర్లలోనూ సైట్ విజిట్ నిబంధన

నైనీ టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ నిబంధన ఎందుకు పెట్టారని హరీశ్ అంటున్నారు. 2018, 2021, 2023 సంవత్సరాల్లో సెంట్రల్ మైన్స్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన మార్గదర్శకాల్లో టెండర్లలో ఈ నిబంధన పెట్టాలని సూచించినందునే నైనీకి కూడా సింగరేణి పెట్టింది. దానికి ముందు అనేక రాష్ట్రాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల టెండర్ల నోటిఫికేషన్లలో కూడా ఇది ఉంది. ఈ నిబంధన పెట్టడం తప్పు కాకపోతే మరి నైనీ టెండర్ నోటిఫికేషన్‌ను ఎందుకు రద్దుచేశారని అందరూ అనవచ్చు. ఆరోపణలు రాగానే... వాస్తవాలు ప్రజలకు పూర్తిగా తెలియకుండా ఆ నోటిఫికేషన్‌ను కొనసాగిస్తే అడ్డగోలుగా ఊహించుకుంటారని వెంటనే రద్దుచేయాలని చెప్పా.

సృజన్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డి ఇప్పటికీ భారాసలోనే ఉన్నారు

పాత కాంట్రాక్టులన్నీ రద్దుచేసి సైట్ విజిట్ అనే నిబంధన పెట్టి సృజన్‌రెడ్డి అనే సీఎం బంధువుకి టెండర్లు కట్టబెడుతున్నారని



హరీశ్‌రావు అంటున్నారు. శోధా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఎండీగా దీప్తిరెడ్డి ఉన్నారు. ఆమె భారాస మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుమార్తె. ఆయన 2018లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో నాతో పాటు ఉండాలి. కానీ కాంట్రాక్టులు, టెండర్లు అని ప్రలోభాలు చూపి ఉపేందర్‌రెడ్డిని భారాసలో చేర్చుకున్నారు. ఆయన అల్లుడు.. దీప్తిరెడ్డి భర్తనే ఈ సృజన్‌రెడ్డి. ఇప్పటికీ ఉపేందర్‌రెడ్డి భారాసలోనే ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దీంతో ఏం సంబంధం సైట్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిన తరవాత ఇప్పటి వరకు 4 కంపెనీలకు మాత్రమే సింగరేణి టెండర్లను కేటాయించింది. శోధా కంపెనీకి వీకే ఓసీ గని-1 కాంట్రాక్టును ఇచ్చింది. మందమర్రి కళ్యాణఖని ఓసీ కాంట్రాక్టును 2025 మేలో ఎక్స్‌ప్రెస్‌వే ఆర్‌వీఎస్ఆర్ కంపెనీకి ఇచ్చింది. ఆర్‌వీఎస్ఆర్ అంటే ఆర్.విద్యాసాగర్‌రావు. ఎక్స్‌ప్రెస్‌వే కంపెనీ ఎండీ దీక్షిత్‌రావు. ఈ కంపెనీలు ఎవరివనేది ందరికీ తెలుసు. మొత్తం 12 మంది టెండర్లు వేయగా ఎవరికీ సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నిరాకరించలేదు. ఆర్‌జీ ఓసీ-2 ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు టెండర్‌ను సీ5 ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్‌కు 2025 జులై 4న ఇచ్చింది. ఈ కంపెనీ డైరక్టర్లు నిశాంత్‌రావు, మదన్‌మోహన్‌రావు. నిశాంత్‌రావు.. భారాస మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు కుమారుడు. ఎస్ఆర్‌పీ ఓసీ-2 ప్రాజెక్టు కోసం 12 మంది టెండర్లు వేయగా హర్ష కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కి దక్కింది. ఈ కంపెనీలో ఎవరెవరు ఉన్నారో, ఇది భారాస పాలనలో ఎన్ని నీటిపారుదల ప్రాజెక్టులు పొందిందో, ఎవరితో చేతులు కలిపిందో అందరికీ తెలుసు. సైట్ విజిట్ నిబంధన పెట్టి మాకు కావాల్సిన వాళ్లకే టెండర్లు ఇచ్చి ఉంటే ఈ కంపెనీలకు వచ్చేవా? ఇంత పారదర్శకంగా టెండర్లు కేటాయించినా విచారణ చేయాలని కేంద్రానికి లేఖ రాసి తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా హరీశ్‌రావు సింగరేణికి, తెలంగాణ ప్రజలకు నష్టం చేస్తున్నారు.

డీజిల్ కొనుగోలు నిబంధనలు భారాస హయాంలోనే మార్చారు...

సింగరేణి.. ఐవోసీ నుంచి డీజిల్ కొనుగోలు మానేసి ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇచ్చినట్లు హరీశ్‌రావు ఆరోపించారు. కాంట్రాక్టర్లు నడిపే వాహనాలకు సంస్థ డీజిల్ సరఫరా చేసే విధానం సింగరేణిలో తప్ప దేశంలో ఎక్కడా లేదు. డీజిల్ సరఫరాలో ఒకప్పుడు పెద్ద స్కాం జరిగింది. అందులో నిందితులు ఇప్పుడు ఎక్కడున్నారనే వివరాలు తరవాత చెపుతా. పాత విధానం మారుస్తామంటే దేశవ్యాప్తంగా ఎలా జరుగుతుంటే అలా చేయాలని చెప్పా. నైనీ గనిలో మట్టి తొలగించే పనుల కాంట్రాక్టు నిబంధనలు మార్చి డీజిల్ సరఫరా వ్యయం కూడా కాంట్రాక్టరే భరించాలని భారాస హయాంలోనే 24-7-2022న ఉత్తర్వులిచ్చారు.

బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి...

బొగ్గుబావులపై ఏ రాబందులను, గద్దలను, ఏ పెద్దలను వాలనీయను. అదనంగా బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి. గత పదేళ్లుగా కొత్త గనులు తెచ్చుకోలేదు. ఉత్పత్తి తగ్గిపోయి అంతిమంగా లాభాలు, ఆదాయం పడిపోయి సింగరేణిపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధిని కోల్పోయే ప్రమాదముంది. బొగ్గు నాణ్యత లేకపోతే వాడకం కూడా తగ్గే ప్రమాదముంది. నాణ్యమైన బొగ్గు గనులను తెచ్చుకుని ఈ సింగరేణిని బతికించుకోవాలి. రాజకీయ లబ్ధి కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో సింగరేణిపై విషం చిమ్మవద్దు. ఏమైనా అనుమానాలుంటే నా తలుపులు అన్నివేళలా తెరిచే ఉంటాయి. ఏం అడిగినా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నా" అని భట్టి అన్నారు.

# సంపాదకీయం

## నకిలీ చరిత్రలతో సామాజిక విద్వేషాలు

చరిత్ర గత సమాజపు జీవన విధానానికి అద్దం వంటిది. అది మన గతాన్ని మాత్రమే కాదు, మన సంస్కృతి, విలువలు, సామాజిక అభివృద్ధి దిశలను కూడా ప్రతిబింబిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు తమ సామాజిక స్థితిని ఉన్నతంగా చూపించుకోవాలనే ఉద్దేశంతో చరిత్రను వక్రీకరించే ప్రమాదకర ధోరణి ప్రారంభమైంది. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానత్వ ఫలాలను అందుకుని కొన్ని సామాజికవర్గాలు కూడు, గూడు, విద్య లాంటి మౌలిక అవసరాలు తీర్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాయి. సామాజిక గౌరవం, ఆత్మగౌరవం కోసం చరిత్రను ఎంచుకుని, చరిత్రలో వెలిగిన రాజవంశాలు, చారిత్రక పురుషులను తమ వర్గానికి ప్రతినిధులుగా చెప్పుకోవడం ద్వారా సమాజంలో తాము గొప్ప చరిత్రకు వారసులమని నమ్మించే మమ్మురి ప్రయత్నాలు చేపట్టాయి. ఆ క్రమంలో కొన్ని అలజడులు, సంఘర్షణలు సమాజంలో అశాంతికి కారణమవుతున్నాయి. కొన్ని కులాలు లేదా వర్గాలు తమ మూలాలను ప్రాచీన పాలక వంశాలతో అనుసంధానం చేస్తూ, తామే రాజ్యాధికారులం, వీరుల వారసులమని గట్టిగా ప్రచారం చేస్తున్నాయి. ఆధారాలు లేనప్పటికీ పుస్తకాలు రాయడం, నకిలీ శాసనాలు రూపొందించడం, శిలాశాసనాల రూపంలో తప్పుడు ఆధారాలను ప్రచారం చేయడం వంటి చర్యలు పెరుగుతున్నాయి. ఇవి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. చరిత్ర అంటే కల్పన కాదు, పరిశోధన. చరిత్ర ఊహల మీద కాకుండా, ఆధారాల మీద నిలబడుతుంది. శిలాశాసనాలు, తామ్రపత్రాలు, పురావస్తు ఆధారాలు, సమకాలీన సాహిత్యం మొదలైనవి చరిత్ర చెప్పడానికి ప్రామాణిక సాక్ష్యాలు. వీటిని విశ్లేషించడంలో భాష, శైలి, కాలం, భౌగోళికత వంటి అంశాలు కీలకం. కానీ నకిలీ చరిత్రలను తయారు చేసేవారు ఈ ప్రమాణాలను పట్టించుకోరు. చరిత్ర పూర్వ యుగంలోని పౌరాణిక పురుషులను తమ కులానికి అన్వయించుకొని ఏదో ఒక రాజవంశాన్ని ఆ పురాణ పురుషుడి వారసులుగా ప్రచారం చేసి, తద్వారా తమ కులం ఒక గొప్ప రాజవంశాన్ని ఈ ఘన చరిత్రకు కానుకగా ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటారు. ఈ వ్యాధి సమాజంలో నేడు విస్తృతంగా ప్రబలుతోంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర బుక్కరాయల విషయంలో కూడా వివిధ కులాల వారు వారిని స్వంతం చేసుకుని వారి కీర్తిని తమ కులాలకు కిరీటాలుగా ధరించాలని తెగ ప్రయాసపడుతున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా కల్పిత ఆధారాలతో చారిత్రక చౌర్యానికి పాల్పడుతున్నారు. తెలుగు జాతి ఘనకీర్తిని ఉన్నత శిఖరాన నిలిపిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు, త్రిసముద్రాధిపతి, కర్ణాట సామ్రాజ్య రమారమణుడిగా కీర్తించబడ్డ మహాచక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల విషయంలోనూ తెలుగువాడని తెలుగు చరిత్రకారులు, కన్నడవాడని కన్నడ చరిత్రకారులు వివిధ సిద్ధాంతాలను రూపొందించుకుని నేటికి వాదులాడుకుంటున్నారు. అదేవిధంగా రాయల వారి కులం విషయంలో కూడా తమ వాడంటే, తమవాడనీ సామాజిక మాధ్యమాల్లో యుద్ధాలు చేసుకుంటున్నారు. ఈ జనవరి 17న రాయల జయంతి రోజు పోటాపోటీగా ఆయన తమ కులం వాడేనని సంబరాలు జరుపుకుని, ఆయన గౌరవానికి భంగం కలిగించారు. ఊహాజనిత ఆధారాలతో పెద్ద గ్రంథాలను రాసుకుంటున్నారు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన మౌర్యులు, శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు, గాంగులు, రాష్ట్రకూటులు, నోలంబులు, బాణులతో కలిపి విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన నాలుగు వంశాల వారు తమ కులపు వారని కొన్ని కులాల వారు సామాజిక మాధ్యమాల్లో తీవ్రంగా ప్రచారం చేసుకుంటున్నారు, భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. కర్ణాటక, తమిళనాడులో కూడా చోళ, పాండ్య, హొయసల, మదురై నాయకుల చరిత్ర వివాదాలతో పలు ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. గతించిన చరిత్ర ఎంత గొప్పదైనా అది తిరిగిరాని వైభవమే. ఆ గొప్పదనంతో ఒరిగేదేమీ లేకపోయినా సమాజంలో విద్వేషాలు సృష్టి అవుతాయి. నాడు ఇప్పటి సమాజంలో ఉన్న కుల వ్యవస్థ లేదు, నాటి సమాజంలో కులాలు వృత్తులు మాత్రమే. రాచరిక వ్యవస్థలో రాజులు ఎప్పుడూ తమ కులాలను బహిరంగపరచలేదు. రాజుగా పట్టాభిషిక్తుడైన వ్యక్తి, ఉపనయనాది క్రతువుల ద్వారా క్షత్రియుడై, బ్రాహ్మణులు ఏర్పాటు చేసిన గోత్రంతో, క్షత్రియ వంశంతో ఒదిగిపోవలసి ఉండేది. ఒక పురాణ పురుషుడి అన్వయంతో తన క్షత్రియ వంశం ప్రశస్తి శాసనాల ద్వారా ప్రచారమయ్యేది. రాజుకు ఉన్న పట్టమహిషుల సంతతి పట్టాభిషేకానికి అర్హతగలిగిన ఉత్తరాధికారులుగా హక్కు కలిగివుండేవారు. రాజు తన రాజ్యంలో అన్ని కులాలతో వైవాహిక సంబంధాన్ని నెరుపుకుని, ఆ వర్గం మద్దతు పొందేవాడు. పట్ట మహిషులను మినహాయించి మిగిలిన ఉప పత్నుల సంతానానికి కూడా పరిపాలనా యంత్రాంగంలో భాగస్వామ్యం కల్పించేవారు. కానీ వారికి రాజు కులం గాని, వారసత్వ హక్కులు గానీ సిద్ధించేవి కావు. ఉప పత్నుల సంతానానికి తల్లి కులమే ఉండేది. వివిధ కులాల ఉప పత్నుల సంతానం కూడా రాజుకు సంతానంగా చెప్పుకోవడం ద్వారా నేటి సమాజంలోని విభిన్న కులాల మధ్య చారిత్రక పురుషులను స్వంతం చేసుకుని, తమ కుల ప్రతిష్ఠను పెంచుకోవాలనే తాపత్రయం అన్ని కులాల్లోనూ అధికమయ్యింది. రాచరిక వ్యవస్థలో రాజు తన సంతానాన్ని వివిధ ప్రాంతాల ప్రతినిధులుగా నియమించడమే కాకుండా, ఆ ప్రాంతంలో ప్రబలంగా ఉన్న కులాలతో వియ్యమందడం ద్వారా ఆ ప్రాంతపు ఆధిపత్యాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి అవకాశం ఏర్పడేది. అన్ని కులాల వారితో బంధుత్వాలు ఏర్పరుచుకుని రాజు ప్రజలందరివాడిగా మసలుకునేవాడు. ఆ వైఖరే నేటి కుల చారిత్రక సంఘర్షణకు ప్రధాన కారణమవుతోంది. రాజు దైవాంశ సంభూతుడనే నాటి విశ్వాసాన్ని గౌరవించి, చారిత్రక పురుషులను కుల చట్రాల్లో బంధించకుండా, వారిని తమ ప్రాంతపు

## ఐసోటోపుల ప్రగతి కిరణాలు



రేడియో ధార్మికత ఆధునిక అణుశాస్త్ర వికాసానికి బాటలు పరిచింది. 1896లో కనుగొన్న ఈ రేడియో యాక్టివిటీ కృత్రిమ రేడియో ఐసోటోపుల అభివృద్ధికి దోహదపడింది. తద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. భవిష్యత్తులోనూ శాస్త్ర సాంకేతిక వికాసానికీ, సుస్థిరాభివృద్ధికీ రేడియో ఐసోటోపులు కీలకం కానున్నాయి. సుమారు వందేళ్ల క్రితం ఫ్రెంచ్ శాస్త్రవేత్త హెన్రీ బెకరల్ యురేనియం లవణంపై పరిశోధనలు చేస్తున్నప్పుడు అనుకోకుండా రేడియో ధార్మికతను కనుగొన్నారు. ఈ లవణాలు సహజంగానే కిరణాలను విడుదల చేస్తున్నట్లు ఆయన గుర్తించారు. 1898లో మేరీ, పియర్ క్యూరీ దంపతులు మరింత ముందడుగు వేసి పోలోనియం, రేడియం అనే రెండు కొత్త రేడియో ధార్మిక మూలకాలను కనుగొన్నారు. ఆ సందర్భంగానే వారు 'రేడియో ధార్మికత(రేడియో యాక్టివిటీ)' అనే పదబంధాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. వీరి పరిశోధనలే కాలక్రమంలో రేడియో ఐసోటోపుల శాస్త్రానికి బలమైన పునాది వేశాయి. ఒకే మూలకానికి చెందిన పరమాణువుల్లో ప్రోటాన్ సంఖ్య ఒకేలా ఉన్నా, న్యూట్రాన్లు వేర్వేరుగా ఉంటే, వాటిని ఐసోటోపులు అంటారు. ఇవి స్థిరంగా ఉండవు. స్థిరత్వం కోసమని శక్తిని(రేడియేషన్‌ను) విడుదల చేస్తూ క్షీణించిపోతాయి. అణుశాస్త్రంలో ఒక మైలురాయిగా భావించే ఈ సిద్ధాంతం- అనంతర కాలంలో కృత్రిమ రేడియో ఐసోటోపుల తయారీకి ఊతమిచ్చింది. ఇవి సహజంగానే కాకుండా, అణు రియాక్టర్లు సైక్లోట్రాన్ల వంటి సాధనాలతోనూ తయారవుతాయి. రేడియో ఐసోటోపులు విడుదల చేసే ఆల్ఫా, బీటా, గామా కిరణాలను ఉపయోగించి వ్యాధుల నిర్ధారణ, చికిత్సలు, కొలతలను కచ్చితంగా అంచనా వేయడం సాధ్యమైంది. కాలక్రమంలో, 1940లో శాస్త్రవేత్తలు కార్బన్-14 అనే రేడియో ఐసోటోపును కనుగొన్నారు. ఇది పురావస్తు రంగంలో పెద్ద విప్లవానికి దారితీసింది. కార్బన్ డేటింగ్ విధానం ద్వారా పురాతన వస్తువులు ఎన్నేళ్లనాటివో కచ్చితంగా అంచనా వేయడం సాధ్యపడింది.

### వైద్యంలో ముందడుగు...

పరిశోధనల పుణ్యమాని 1950 దశకంలో అయోడిన్-131, కోబాల్ట్-60, టెక్నీషియం-99 వంటి రేడియో ఐసోటోపుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. 'న్యూక్లియర్ మెడిసిన్' ఆధునిక వైద్యరంగం ముఖచిత్రాన్నే మార్చేసింది. నేడు రేడియో థెరపీ ద్వారా క్యాన్సర్ కణాలను నాశనం చేసి, ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక రంగాల పురోగతికీ రేడియో ఐసోటోపులు కీలకమవుతున్నాయి. నైట్రోజన్-15 అనే ఐసోటోపు ద్వారా మొక్కలు నైట్రోజన్ ఎరువులను ఎంతవరకు గ్రహిస్తున్నాయి, ఎంత నష్టం జరుగుతుందనేది అంచనా వేయవచ్చు. వేర్ల అభివృద్ధికీ, మొక్కల పెరుగుదలకూ, పోషక లోపాల నివారణకూ ఫాస్ఫరస్-32 ఐసోటోపు ఉపయోగపడుతోంది. ఇప్పుడు పంటల అభివృద్ధిలో 'మ్యూటేషన్ బ్రీడింగ్' కీలకమవుతోంది. ఇందులో భాగంగా కోబాల్ట్-60 నుంచి ఉత్పన్నమయ్యే గామా లేదా న్యూట్రాన్ కిరణాలను ఉపయోగించి విత్తనాల్లో నిర్దిష్ట మార్పులు చేస్తారు. దీనివల్ల వాతావరణ మార్పులనూ తెగుళ్లనూ తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నారు. మన దేశంలో వరి, గోధుమ, వేరుశనగ తదితర పంటల సేద్యంలో ఇలాంటి వంగడాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. కీటక నియంత్రణకు రేడియేషన్ ఆధారిత స్టెరైల్ ఇన్సెక్ట్ టెక్నిక్(ఎస్ఐటీ) బాగా ఉపకరిస్తోంది. దీనిద్వారా విడుదలయ్యే గామా కిరణాలు కీటకాలను నాశనం చేసి, వాటి జనాభాను నియంత్రిస్తాయి. తద్వారా ప్రమాదకర పురుగుమందుల వినియోగం తగ్గి, పంటలు ఆరోగ్యంగా ఎదుగుతాయి. దానివల్ల ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికీ మేలు జరుగుతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాల వినియోగం ఎక్కువైంది. అనేక చోట్ల నీటి కొరత వేధిస్తోంది. ఇటువంటి తరుణంలో భూగర్భ జల వనరుల నిర్వహణలో ఐసోటోపిక్ సాంకేతికతలు, రేడియో ఐసోటోపులు కీలకమవుతుండటం విశేషం. ట్రీటియం, ఆక్సిజన్-18, డ్యూటీరియం వంటి ఐసోటోపుల సాయంతో ఒక ప్రాంతంలోని భూగర్భ జలాలు ఎలా సమకూరాయి? అందులో వర్షపు నీటి శాతమెంత? వాటి వయసెంత? ఎక్కడెక్కడ రీఛార్జ్ ప్రాంతాలున్నాయి? అనేది అంచనా వేస్తారు. తద్వారా ఏదైనా ప్రాంతంలో భూగర్భ జలాల స్థితిగతులేమిటో స్పష్టంగా తెలుస్తుంది. కార్బన్-14 ద్వారా వేల సంవత్సరాల నాటి భూగర్భ జలాలను ఇట్టే గుర్తుపట్టవచ్చు! ఇది ఎడారి ప్రాంతాల్లో నీటి వినియోగానికి అత్యంత కీలకమవుతోంది. క్లోరిన్-36, హీలియం-3 వంటివైతే... లోతైన భూగర్భ జలాల ప్రవాహ మార్గాలను తెలుసుకోవడానికీ ఉపయోగపడతాయి. పారిశ్రామిక, సాగు వ్యర్థాలు భూగర్భ జల వనరులను ఎలా కలుషితం చేస్తున్నాయో అర్థం చేసుకోవడానికి సైతం అక్కరకొస్తున్నాయి.

### మానవ ప్రయోజనాలకు...

పారిశ్రామిక రంగంలో రేడియో ఐసోటోపులను నాణ్యత, భద్రతల కోసం వాడుతున్నారు. లోహాల్లోని బీటలనూ, పైపుల్లోని లీకేజీలనూ గుర్తించడం వీలవుతోంది. తద్వారా ప్రమాదాలు తగ్గి, ఉత్పాదక సామర్థ్యం పెరుగుతోంది. విద్య, పరిశోధన, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లోనూ రేడియో ఐసోటోపులు కీలకమవుతున్నాయి. జీవక్రియలు, అణు నిర్మాణం, పదార్థ లక్షణాలను అర్థం చేసుకోవడానికి వీటిని విరివిగా వాడుతున్నారు. భవిష్యత్తులో సామాజిక ప్రయోజనాల కోసమే కాకుండా, సాంకేతిక పురోగతిలోనూ రేడియో ఐసోటోపుల పాత్ర మరింత పెరగనుంది. వీటితో కూడిన అధ్యయనాల ద్వారా ప్రభుత్వాలు, నీటి నిర్వహణ సంస్థలు తగిన నిర్ణయాలు తీసుకోగలుగుతాయి. ప్రపంచ దేశాలు అణుబాంబులు వంటి విధ్వంసక ఆయుధాల తయారీకీ, యుద్ధాల కోసమూ కాకుండా... విశ్వమానవ విస్తృత ప్రయోజనాల కోసమే రేడియో ఐసోటోపులను వినియోగించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచిస్తాయని అణుశక్తి, ఐసోటోపుల వాడకంలో జాగ్రత్తగా ఉంటాయని ఆశిద్దాం.

## దర్యాప్తులో నిర్లక్ష్యం... న్యాయానికి అన్యాయం!



మహిళలను చూస్తేనే మెదడులో మురికి ఆలోచనలు వరదలెత్తే ప్రబుద్ధులకు దేశీయంగా కొదవలేదు. కారుకూతలతో రోడ్ల మీద వెంటాడి వేధించే జులాయిల నుంచి కిరాతక నేరాలకు తెగబడుతున్న నరరూప రాక్షసుల వరకు ఎవరికీ మన సమాజంలో లోటులేదు. స్త్రీల భద్రతకు ప్రాణసంకటాలుగా తయారైన అలాంటి పాపాత్ములను వెంటనే పట్టుకుని త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూడటం పోలీసుల బాధ్యత. ఈ విషయంలో ఖాకీలు ఎంతవరకు సఫలమవుతున్నారని చూస్తే ఎవరి గుండెలైనా బరువెక్కాల్సిందే. ఆధారాల సేకరణ, వాటి పరిశీలన, న్యాయస్థానాల్లో సమర్పణ తదితరాల్లో అనేక లోపాల వల్ల చాలా అత్యాచార కేసుల్లో దోషులెవరో తేలట్లేదు. ఒకవేళ కింది కోర్టుల్లో శిక్ష పడినా, పసలేని దర్యాప్తుల వల్ల పై కోర్టుల్లో ఆ కేసులు వీగిపోతున్నాయి. ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ కాలంలోనూ దేశానికి పట్టిన చీడపురుగులను సమర్థంగా వదిలించలేకపోవడం ఎంత సిగ్గుచేటు! ఎనిమిదేళ్ల కిందట గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో ఒక వివాహిత సామూహిక అత్యాచారం, హత్యకు గురయ్యింది. ఆ కేసులో సెషన్స్ కోర్టు ముగ్గురిని దోషులుగా తేల్చి వారికి మరణ శిక్ష విధించింది. కానీ- వీర్య, రక్త నమూనాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపడంలో ఆలస్యానికి తోడు ఆ సమయంలో వాటిని ఎలా భద్రపరిచారన్నది రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో గుజరాత్ హైకోర్టు ఇటీవల వారిని నిర్దోషులుగా విడుదల చేసింది. కీలక ఆధారాల విషయంలో యంత్రాంగం బాధ్యతారాహిత్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవస్థాగత నిర్లక్ష్యం కారణంగా బాధితురాలి కుటుంబానికి జరిగిన అన్యాయమిది! దర్యాప్తులో పద్ధతీ పాడూ పాటించకపోతే అసలు దోషులకు శిక్షలెలా పడతాయి? ఉత్తర్ ప్రదేశ్‌లో ఒక మైనర్‌ను బలాత్కరించి హత్య చేసిన కేసులో అదనపు సెషన్స్ కోర్టు ఒకరికి మరణ దండన, మరొకరికి యావజ్జీవ కారాగారవాసం విధించింది. కేసు సుప్రీంకోర్టు ముందుకొచ్చాక దర్యాప్తులో లొసుగులు లెక్కకుమిక్కిలిగా బయటపడ్డాయి. ఆధారాల సేకరణ, డీఎన్ఏ పరీక్షల్లో గందరగోళం లాంటి వాటి కారణంగా న్యాయపాలిక వారిని వదిలిపెట్టాల్సి వచ్చింది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల్లో కొంతమంది ఇంతలా కళ్లు మూసుకుని పనిచేస్తుంటే మన నేర న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకమేముంటుంది? దిల్లీలో 'నిర్భయ' దారుణోదంతం తరవాత మహిళలపై దాష్టీకాలకు ఒడిగట్టే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలను పదునుతేల్చారు. అది హర్షణీయమే కానీ, దర్యాప్తులే ప్రహసన ప్రాయంగా మారుతున్నప్పుడు సెక్షన్ల కోరలకు ఎంత పదునుపెట్టి ఏంటి ప్రయోజనం? మచిలీపట్నానికి చెందిన యువతి 2014లో ముంబయిలో హేయ అకృత్యానికి బలైంది. చంద్రభాన్ సనప్ అనే వ్యక్తిని ఆ దారుణానికి పాల్పడ్డాడని చెప్పి పోలీసులు అతనికి సంకెళ్లు వేశారు. ట్రయల్ కోర్టు ఆ చంద్రభాన్‌కు ఉరి శిక్షే సరని తీర్పు చెప్పింది. కానీ, సాక్ష్యాధారాల సేకరణ సక్రమంగా జరగలేదంటూ సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాసిక్యూషన్ కథనాన్నే తప్పుపడుతూ నిరుడు అతణ్ని నిర్దోషిగా ప్రకటించింది. జాతీయ రాజధాని ప్రాంతంలో కార్యాలయం నుంచి ఇంటికి వస్తున్న యువతి 2012లో సామూహిక అత్యాచారానికి గురైంది. విచారణలో లోటుపాట్లను ప్రస్తావిస్తూ బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద ముగ్గురు నిందితులపై కేసును న్యాయపాలిక కొట్టేసింది. కృష్ణా జిల్లాలో ఆయేషా మీరా, నొయిడాలోని నిఠారీ మారణకాండ... సరైన దిశాదశలేని దర్యాప్తుల మూలంగా ఇలా ఎన్నో కేసుల్లో నిజమైన నేరగాళ్లు ఎవరో సంవత్సరాలు గడిచిపోతున్నా నిగ్గుతేలట్లేదు. జుగుప్సాకర నేరాలు చేసినవారు స్వేచ్ఛాజీవులుగా విహరిస్తున్న దౌర్భాగ్య పరిస్థితుల్లో అమ్మాయిలపై లైంగిక దాడులు ఆగట్లేదు. దేశీయంగా 2012లో స్త్రీలపై దాదాపు 25వేల అత్యాచారాలు నమోదయ్యాయి. 2023లో అవి సుమారు 30 వేలకు చేరాయి. పరిస్థితులు ఇంత ఘోరంగా ఉన్నా, 2018-2022 మధ్యలో అత్యాచార కేసుల్లో శిక్షల రేటు 28శాతానికే పరిమితమైందంటే సంబంధిత పోలీసులు ఏం పనిచేస్తున్నట్లు? 2023 చివరి నాటికి రెండు లక్షలకు పైగా రేప్ కేసుల్లో విచారణలు పెండింగ్‌లో పడి ఉన్నాయి. అంటే, అన్ని కుటుంబాలు న్యాయంకోసం కన్నీళ్లతో ఎదురుచూస్తున్నట్లే కదా! వాస్తవానికి, అత్యాచార కేసులంటేనే చాలామంది పోలీసులు చిన్నచూపు చూస్తారు. స్త్రీలు బాధితులైన సందర్భాల్లో కేసులు కట్టడానికే ఖాకీలు మీనమేషాలు లెక్కించిన ఉదంతాలు గతంలో వెలుగు చూశాయి. పైగా ఎంతో వేదనతో ఠాణాకు వెళ్లినవారిని పట్టుకుని 'కూతుళ్లని బయటికి పంపడం మీ తప్పే' అని వెకిలిగా వ్యక్తిత్వ హననం చేయడం కొందరికి పరిపాటిగా మారింది. పోలీసుల వ్యవహారశైలితో తమ మానసిక వేదన రెట్టింపైనట్లు 73శాతం అత్యాచార బాధితులు ఒక జాతీయస్థాయి సర్వేలో వాపోయారు. ఈ దయనీయావస్థకు తోడు నానా మాటలతో కాల్చుకుతినే సమాజానికి భయపడి చాలామంది లైంగిక దాడులపై నిశ్శబ్దంగా ఉండిపోతూ తమలో తామే కుమిలిపోతున్నారు. దీనివల్ల అత్యాచార దారుణాలన్నీ పూర్తిగా బయటికే రావట్లేదు. ఇలాంటి భయానక వాతావరణంలో మహిళల శక్తి సామర్థ్యాలను దేశం ఎలా వినియోగించుకోగలుగుతుంది? జనాభాలో దాదాపు సగభాగమైన స్త్రీలకు తగిన భద్రత లేనప్పుడు అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది?

## అరెస్టు భయంతోనే ఈ కుప్పిగంతులా?

'నాకు భయం లేదు' అని గొప్పగా చెప్పుకునే నేతలు.. విచారణ పేరు వినగానే వణికిపోవడం కొత్త కాదు. అధికారం చేతిలో ఉన్నంత కాలం ప్రజాస్వామ్యాన్ని తొక్కి, ప్రతిపక్షాల గొంతులు నొక్కి ఇప్పుడు అదే ప్రజాస్వామ్య వ్యవస్థ ముందుకు వచ్చేసరికి మాటలతోనే యుద్ధం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ ప్రారంభమైన నాటి నుంచి మాజీ మంత్రి కేటీఆర్ ప్రవర్తన చూస్తే.. ధైర్యం నటన ఒకటి, లోపల దాగి ఉన్న భయం ఇంకొకటి అన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు అరెస్టు చేస్తారా? చేయలేరా? అంటూ మీడియా ముందు సవాళ్లు విసురుతూనే.. మరోవైపు అదే భయం ఆయన మాటల్లో, చేష్టల్లో ప్రతిరోజూ బయటపడుతోంది.

మ్యారేజ్.. బాయ్‌కాట్ గోల్డ్!

అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులపై రకరకాల కేసులు బనాయించి.. అర్ధరాత్రుళ్లు ఇళ్లపై పడి తలుపులు బద్దలుగొట్టి వారిని ఎత్తుకెళ్లిన రోజులు కేటీఆర్ అప్పుడే మర్చిపోయారా? లేక వారి హయాంలో మాదిరే అర్ధరాత్రిళ్లు ఎత్తుకు వెళ్లకుండా ఇలా మర్యాదపూర్వకంగా నోటీసులు ఇచ్చి పిలుస్తుండడం ఆయనకు నచ్చడం లేదా?

దేశానికి ఉక్కు కవచం..

కూతురు చెప్పినా బుకాయిస్తారా?

బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే విషయం రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి తెలుసు.. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే నాయకులు సాధారణ ఫోన్లలో మాట్లాడడం మానేసి వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌ల్లో ఫోన్ కాల్స్ మాట్లాడుకునేవారు.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లు సైతం తమ మాటలను బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ వింటున్నారోనని హడలి పోయేవారు.. తనకు ఫోన్ చేయొద్దని స్వయంగా హరీశ్ రావు బీఆర్ఎస్ నాయకులకు చెప్పారని కేసీఆర్ కుటుంబంతో తొలి నుంచి అనుబంధం ఉన్నవి. ప్రకాశ్ ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇక కేటీఆర్ చెల్లెలు కవిత తన భర్త ఫోన్‌ను సైతం ట్యాప్ చేశారని స్వయంగా మీడియా ముందే చెప్పారు.. ఆ ఇంటి ఆడ బిడ్డే ఈ విషయం చెప్పిన తర్వాత కూడా ఇంకా తాము ఫోన్ ట్యాపింగ్ చేయించలేదని.. తాము సుద్దపూసలమని బుకాయించడం కేటీఆర్, హరీశ్ రావులకే చెల్లింది.

ప్రజాస్వామ్యం.. ప్రజల చైతన్యానికి ప్రతిరూపం




ఉద్యమాన్ని అడ్డంపెట్టుకుని..

ఉద్యమాన్ని కవచంగా చేసుకొని అడ్డగోలుగా మాట్లాడడాన్ని అలవాటు చేసుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు.. అధికారంలో ఉన్నప్పుడు మరింతగా రెచ్చిపోయారు. కేసీఆర్ బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లలో వాడిన పరమ కంపు పదజాలమంతా ప్రజలకు గుర్తే ఉంది. తమకు నచ్చని వారిని.. తమ వ్యతిరేకులను తెలంగాణ వ్యతిరేకులుగా ముద్రలు వేసి అడ్డగోలుగా మాట్లాడారు. ఉద్యమ సమయంలో అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులను, నిబంధనలు అంగీకరించవని చెప్పిన అధికారులను వీరు తిట్టిన తిట్లు ఇప్పటికీ యూట్యూబ్‌లో ఉంటాయి. హరీశ్ రావు ఢిల్లీ ఏపీ భవన్‌లో ఏకంగా ఓ బీసీ అధికారిని కొట్టడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. అదేమంటే ఉద్యమకారులమని.. అవతలివాళ్లు తెలంగాణ ద్రోహులని సమర్థించుకున్నారు. ఉద్యమంలో భాగంగా వాటిని ప్రజలు చూసీచూడనట్లు వదిలేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు తీరుమారలేదు.. తాము ప్రజాస్వామ్యంలో ఉన్నామని... తమ అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని వారు మర్చిపోయారు. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ వంటి అనైతిక చర్యలకు తెగబడ్డారు. ఇప్పుడు మాత్రం తమకేం తెలియదని.. తాము సత్య హరిశ్చంద్రుల వారసులమని బావ, బావమరుదులు ప్రకటనలు ఇస్తున్నారు..

కుల రాక్షసత్వంపై మోగిన దండోరా..

అందుకే ప్రభుత్వంపై విమర్శలు..

నిజానికి ఫోన్ ట్యాపింగ్ విచారణ అంటేనే హరీశ్ రావు, కేటీఆర్ వణికిపోతున్నారు. విచారణకు పిలిచిన ప్రతిసారి తామేదో స్వాతంత్ర్య పోరాటానికి వెళ్లి వచ్చిన వారిలా జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి నేతలు, కార్యకర్తలను పిలిపించి స్వాగతాలు చెప్పించుకుంటున్నారు. పైగా తామే సిట్‌ను విచారించినట్లు ఫోజులు కొడుతున్నారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే ప్రస్తుతం విచారణ చేపడుతున్న అధికారుల అంతు చూస్తామంటూ బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇక నోటీసులు ఇచ్చింది మొదలు తమ మీడియా చేత ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై అసత్యాల ప్రచారం చేయిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయం అధికారికంగా నిరూపితమైతే తాము రాజకీయంగా శాశ్వతంగా సమాధి అవుతామనే విషయం వారికి తెలుసు.. అందుకే నిత్యం అసభ్య పదజాలంతో రేవంత్ రెడ్డిని దూషిస్తున్నారు. ఆ మాటలకు ఆయన రెచ్చిపోయి వారిని అరెస్టు చేయిస్తే విషయాన్ని పక్కదారి పట్టించాలనే కుట్రతో బావ బావమరదులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.

ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి..

బీఆర్ఎస్ నాయకులు ఒక్కటి గుర్తుంచుకోవాలి.. రేవంత్ రెడ్డి సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చినవాడు.. అనేక అవమానాలు, అవహేళనలను ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థానం వరకు ఎదిగిన నాయకుడు. ప్రతీకారం ఆయన మార్గం కాదు.. అదే ప్రధానమని భావిస్తే ఇప్పటికే కేటీఆర్, హరీశ్‌రావు పదుల సార్లు జైలుపాలయ్యే వారు.. ప్రజలు అన్నింటిని గమనిస్తూనే ఉన్నారు. అందుకే శాసనసభ ఎన్నికల నుంచి ప్రారంభమైన బీఆర్ఎస్ పతనం లోక్‌సభ ఎన్నికల్లో.. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికల్లోనూ కొనసాగింది. ఇకనైనా వారు తీరుమార్చుకోకుంటే మున్ముందు ముసళ్ల పండుగను ఎదుర్కోక తప్పదు..

# 5 రాష్ట్రాల ఎన్నికల వేళ కేంద్ర బడ్జెట్: జీఎస్టీ తరహాలోనే ఆదాయపు పన్ను శ్లాబ్‌లలో సంస్కరణలు

**ఆదాయపు పన్ను శ్లాబ్‌లను తగ్గించేందుకు కేంద్రం యోచన?– జీఎస్టీ తరహాలోనే సంస్కరణలు చేస్తుందనే అంచనాలు– కొత్త పన్ను విధానాన్ని సరళతరం చేసే అవకాశాలు**




కేంద్ర బడ్జెట్ – 2026పై వాడివేడి చర్చ జరుగుతోంది. గతేడాది వస్తు,సేవల పన్ను(జీఎస్టీ) శ్లాబ్‌లలో సంస్కరణలతో దేశ ప్రజల మనసులు గెల్చుకున్న మోదీ సర్కారు, ఈసారి ఆదాయపు పన్ను(ఐటీ) వ్యవస్థలోనూ విప్లవాత్మక సంస్కరణలు చేయబోతోందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇందులో భాగంగా నూతన ఆదాయపు పన్ను విధానంలోని 7 ట్యాక్స్ శ్లాబ్‌ల సంఖ్యను వీలైనంత మేరకు తగ్గించాలనే యోచనతో ప్రభుత్వం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేద, దిగువ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, ధనిక వర్గాలను కవర్ చేసేలా ఆదాయపు పన్ను శ్లాబ్‌లను శాస్త్రీయంగా వర్గీకరించే దిశగా కసరత్తు జరుగుతోందని చెబుతున్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ అచ్చం జీఎస్టీ శ్లాబ్‌ల తరహాలోనే సింపుల్‌గా, సూటిగా, క్లారిటీతో ఐటీ శ్లాబ్‌లు ఉంటాయని తెలుస్తోంది.

## త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు

జీఎస్టీ అనేది పరోక్ష పన్ను. ఇన్‌కమ్ ట్యాక్స్ అనేది ప్రత్యక్ష పన్ను. ఆదాయపు పన్ను ప్రతి ఒక్కరికి సంబంధించిన అంశం. దీనితో యావత్ ప్రజానీకం నేరుగా కనెక్ట్ అవుతారు. గతేడాది జీఎస్టీలో కేంద్ర సర్కారు చేసిన సంస్కరణలతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తమిళనాడు, కేరళ, బంగాల్, అసోం, పుదుచ్చేరి లాంటి కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ ఈసారి ఇన్‌కమ్ ట్యాక్స్ విధానంలో సంస్కరణలకు కేంద్రం రంగాన్ని సిద్ధం చేస్తోంది. అందుకే ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ సంస్కరణలపై ప్రకటన చేయాలని మోదీ సర్కారు యోచిస్తోందని పరిశీలకులు అంటున్నారు. తద్వారా విపక్షాల కంచుకోటలుగా ఉన్న తమిళనాడు, కేరళ, బంగాల్‌లలో ప్రజలను ఆకట్టుకోవాలనే ప్లాన్‌తో బీజేపీ ఉందని విశ్లేషిస్తున్నారు.

## జీఎస్టీ శ్లాబ్‌లను ఎలా మార్చారు?

మన దేశంలో 2017 జులై 1న జీఎస్టీ వ్యవస్థ ప్రారంభమైనప్పుడు 0%, 5%, 12%, 18%, 28% అనే ఐదు శ్లాబ్‌లు ఉండేవి. విలువ ఆధారిత పన్ను (వ్యాట్), సర్వీస్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, వినోద పన్ను, ఆక్ట్రాయ్ పన్ను వంటివన్నీ కలిపేసి జీఎస్టీ ట్యాక్స్‌ను తీసుకొచ్చారు. వస్తువులు, ఉత్పత్తులు, సేవలను ఈ ఐదు జీఎస్టీ శ్లాబ్‌లలోకి ఆనాడు వర్గీకరించారు. ఇవి గందరగోళంగా, సమస్యాత్మకంగా, సంక్లిష్టంగా, చిక్కుముడుల్లా ఉన్నాయనే అభిప్రాయం వ్యాపార వర్గాల్లో వ్యక్తమైంది. చాలా నిత్యావసరాలపై భారీ జీఎస్టీని విధిస్తున్నారని సామాన్య ప్రజలు గగ్గోలు పెట్టారు. దీంతో గతేడాది కేంద్ర బడ్జెట్ సందర్భంగా జీఎస్టీలో భారీ సంస్కరణలు చేశారు. 5 శాతం, 18 శాతం అనే రెండు ప్రధాన జీఎస్టీ శ్లాబ్‌లను అమల్లోకి తెచ్చారు. 12 శాతం, 28 శాతం శ్లాబ్‌లను రద్దు చేసి, వాటిలోని చాలా వస్తు, సేవలను 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లలో చేర్చారు. భారీ ధరలు ఉండే లగ్జరీ, సిన్ గూడ్స్‌ను 40 శాతం జీఎస్టీ శ్లాబ్‌లోకి చేర్చారు.

## పాత పన్ను విధానం మా కొత్త పన్ను విధానం

ఇన్‌కమ్ ట్యాక్స్ విషయానికొస్తే, మన దేశంలో ప్రస్తుతం పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం రెండూ అమల్లో ఉన్నాయి. పాత పన్ను విధానంలో కేవలం 4 ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌లే ఉండేవి. కానీ కొత్త పన్ను విధానంలో ఏకంగా 7 ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌లు ఉన్నాయి. అంటే కొత్త పన్ను విధానం ఇంకా టఫ్‌గానే ఉంది. దీన్ని వీలైనంత మేరకు సరళతరం చేసే దిశగా సంస్కరణలు చేయాలనే యోచనతో కేంద్ర సర్కారు ఉందట. ఇందులో భాగంగా కొత్త పన్ను విధానంలోని ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌ల సంఖ్యను తగ్గించనున్నారని సమాచారం. ఈ కింది పట్టికలు చూస్తే మీకు పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానంలోని శ్లాబ్‌లపై కొంత క్లారిటీ వస్తుంది.

## పాత పన్ను విధానం శ్లాబ్‌లు వార్షిక ఆదాయం పన్ను

రూ.2.5 లక్షల వరకు లేదు రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 5% రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు 20% రూ.10 లక్షలకుపైగా 30%

## కొత్త పన్ను విధానం శ్లాబ్‌లు అంచనాలు వార్షిక ఆదాయం పన్ను

రూ.4 లక్షలలోపు లేదు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 5% రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10% రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు 15% రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు 20% రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25% రూ.24 లక్షలకుపైగా 30%

## జరగబోయే ఆదాయపు పన్ను సంస్కరణలేంటి

జీఎస్టీని 5 శాతం, 18 శాతం అనే రెండు ప్రధాన శ్లాబ్‌లకు పరిమితం చేశారు. ఇదే విధంగా దేశంలోని ఆదాయ వర్గాలను మూడు లేదా నాలుగు ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌లకు పరిమితం చేసే అవకాశం ఉంది. 5 శాతం నుంచి 25 శాతం వరకు ఉన్న ఐదు ఆదాయపు పన్ను శ్లాబ్‌లను మధ్యస్థ పన్ను రేట్లతో మూడు శ్లాబ్‌లుగా వర్గీకరించే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శ్లాబ్‌లను తగ్గించడం వల్ల ప్రజలకు పన్ను చెల్లింపు అంశాలపై గందరగోళం తగ్గుతుంది. తమ చేతికి ఎంత వేతనం వస్తుంది? పన్ను కోసం ఎంత పోతుంది? అనే దానిపై క్లారిటీ వస్తుంది. కొత్త పన్ను విధానం ప్రకారం, సంవత్సరానికి రూ. 24 లక్షలకుపైగా ఆదాయాన్ని ఆర్జించే వారిపై 30 శాతం ఆదాయపు పన్ను విధిస్తున్నారు. దేశంలోని అధిక ఆదాయ వర్గాలకు సంబంధించిన పన్ను శ్లాబ్‌ను 30 శాతానికి మించి పెంచాలనే ప్రతిపాదన ప్రభుత్వం పరిశీలనలో ఉందని అంటున్నారు. తద్వారా అధిక ఆదాయ వర్గాలు ఒక నిర్దిష్ట కేటగిరీలోకి చేరుతారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. భారీ ధరలు ఉండే లగ్జరీ, సిన్ గూడ్స్ కోసం 40 శాతం జీఎస్టీతో ప్రత్యేక శ్లాబ్‌ను ఏర్పాటు చేశారు. అచ్చం ఇదే విధంగా అధిక ఆదాయ వర్గాల పన్ను శ్లాబ్ ఉంటుందని చెబుతున్నారు. కొత్త పన్ను విధానం ప్రకారం, ఏటా రూ.12 లక్షల దాకా వార్షిక ఆదాయం కలిగిన ఉద్యోగులపై ఇన్‌కమ్ ట్యాక్స్ ఉండదు. ఒకవేళ ఎవరైనా ఉద్యోగికి ఈ వార్షిక ఆదాయం రూ.13 లక్షలకు పెరిగితే, అతడు రూ.60వేల పన్ను మినహాయింపును నష్టపోతాడు. అంటే నిర్దిష్ట పరిమితికి మించి కొంతమేర వార్షిక ఆదాయం పెరిగినా ఉద్యోగిపై పన్ను భారం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారాన్ని ఇచ్చేలా ఆదాయపు పన్ను శ్లాబ్‌లలో మార్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఎఫెక్టివ్ ట్యాక్స్ రేట్ (ఈటీఆర్) అనే అంశంపైనా కేంద్ర ఆర్థికశాఖ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఒక వ్యక్తి సంపాదించే వార్షిక ఆదాయంపై నేరుగా ట్యాక్స్ విధించరు. అతడికి పన్ను మినహాయింపులు, తగ్గింపులు, రాయితీలు ఇస్తారు. ఇవన్నీ పోగా మిగిలిన ఆదాయంపైనే నిర్దిష్ట రేటు ప్రకారం పన్నును విధిస్తారు. దీన్నే ఎఫెక్టివ్ ట్యాక్స్ రేట్ అంటారు. చెల్లించిన ఆదాయపు పన్నుల విలువను, పన్ను విధించేందుకు ప్రాతిపదికగా తీసుకున్న ఆదాయపు విలువతో భాగహారం చేసి, 100తో గుణిస్తే ఎఫెక్టివ్ ట్యాక్స్ రేట్ వస్తుంది. దీని ప్రాతిపదికన ఆదాయపు పన్ను శ్లాబ్‌లను మరింత సులభతరం చేయడంపై కేంద్రం ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు మరో జనరంజక సంస్కరణపై ప్రకటన చేస్తుందనే ముమ్మర ప్రచారం జరుగుతోంది. కచ్చితంగా ఆ ప్రకటన ఆదాయపు పన్నుకు సంబంధించిందే అయి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. జీఎస్టీలో భారీ సంస్కరణలు చేసిన సర్కారు, తప్పకుండా ఆదాయపు పన్ను విభాగంలోనూ సంస్కరణలు చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ప్రకృతి వైపరీత్యాల్లో ‘బొద్దింక రోబో’ల సాయం. టెక్నాలజీతో అద్భుతాలు

**జర్మనీకి చెందిన ‘స్వార్మ్ బయోటాక్టిక్స్’స్టార్టప్ కంపెనీ బొద్దింక రోబోలను తయారుచేస్తోంది. ఇవి యుద్ధంలో సాయం చేస్తాయట.**

**ప్రకృతి వైపరీత్యాల్లో ‘బొద్దింక రోబో’ల సాయం.. టెక్నాలజీతో అద్భుతాలు**

సైన్స్ ఫిక్షన్ సినిమా తరహాలో యుద్ధంలో శత్రువులను ఎదుర్కొనేందుకు జర్మనీ శాస్త్రవేత్తలు వినూత్న ప్రయోగం మొదలుపెట్టారు. ఈ ఎక్స్‌పర్మెంట్ కోసం ఏకంగా బొద్దింకలను ఎంచుకున్నారు. ఈ మేరకు జర్మనీకి చెందిన ‘స్వార్మ్ బయోటాక్టిక్స్’స్టార్టప్ కంపెనీ బొద్దింకలను గూఢచారి రోబోలుగా మార్చేస్తుంది. ఇవి భూమి పగుళ్లలో, ఇరుకైన గోడల మధ్య, పైపుల్లో, చెత్తలో ఇలా డ్రోన్లు వెళ్లలేని ప్రాంతాలకు సైతం ఈజీగా వెళ్లగలవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూలిపోయిన బిల్డింగ్స్ లోపల చిక్కుకున్న వారిని గుర్తించడానికి సాయపడనున్నాయి. అంతేకాదు అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ వంటి ప్రదేశాల్లోనూ సమర్థవంతంగా పనిచేసేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రయోగంలో బొద్దింకలకు ఆధారిత మైక్రో బ్యాక్‌ప్యాక్‌లను అమర్చుతున్నారు. ఈ బ్యాక్ ప్యాక్ పూర్తిగా బొద్దింక నాడి వ్యవస్థతో కనెక్ట్ అయి ఉంటుంది. ఇందులో మైక్రో కెమెరాలు, మైక్రో ఫోన్లు, గ్యాస్ సెన్సార్లు, డాపర్లు, రాడార్ వంటి పరికరాలుంటాయి. బొద్దింకలకు అమర్చిన ఎలక్ట్రిక్ యాంటెన్నాల ద్వారా ఎక్కడికి వెళ్లాలి? ఎలా వెళ్లాలి? అనే సిగ్నల్స్‌ను కమాండర్లు కంట్రోల్ చేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాయంతో ఒకేసారి వందలాది బొద్దింకలను గుంపులు గుంపులుగా నిర్ధేశించిన ప్రదేశానికి పంపించనున్నారు. బొద్దింకలు టార్గెట్ చేసిన ప్లేస్‌కు వెళ్లగానే దానికి అమర్చిన కెమెరాలు, సెన్సార్లు అక్కడి పూర్తి సమాచారం అందిస్తాయి. దీని ఆధారంగా ఆపరేషన్ చేపట్టనున్నారు.

బొద్దింకలే ఎందుకు?

ఇవి భూమి మీద అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుంటాయి. మనుషుల కంటే 10 రేట్లు ఎక్కువగా హై టెంపరేచర్, రేడియేషన్లను తట్టుకుని నిలబడతాయి. సాధారణ రోబోలు మెట్ల మీద,

# అలర్ట్- 149 మిలియన్ల జీమెయిల్, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్ యూజర్ల పాస్‌వర్డ్స్ లీక్!

**సుమారు 149 మిలియన్ల (14.9 కోట్ల) సోషల్ మీడియా యూజర్ల లాగిన్ వివరాలు లీక్ : రిపోర్ట్**



సోషల్ మీడియా యూజర్లకు షాకింగ్ న్యూస్. కోట్లాది మంది డేటా లీక్ అయిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 14.9 కోట్ల మంది అకౌంట్లకు సంబంధించిన యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు ‘ఎక్స్‌ప్రెస్ వీపీఎన్‘ పేర్కొంది. ఈ మేరకు సంచలన నివేదికను విడుదల చేసింది. డేటా లీక్ అయిన వారిలో జీమెయిల్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్‌తో సహా పలు ఇంటర్నెట్ సంస్థలకు చెందిన యూజర్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ లీక్‌లో యూజర్‌నేమ్‌లు, పాస్‌వర్డ్‌లు వంటి అత్యంత సున్నితమైన కీలక సమాచారం ఉన్నట్లు సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ‘ఎక్స్‌ప్రెస్ వీపీఎన్‘ అనేది వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జెరెమియా ఫౌలర్ ఈ లీకేజీలను గుర్తించినట్లు ‘ఎక్స్‌ప్రెస్ వీపీఎన్‘ నివేదిక తెలిపింది.

## ప్రభుత్వాల డొమైన్ల లాగిన్ వివరాలు కూడా

ఈ లీకేజీలో భయంకరమైన విషయం ఒకటి ఉంది. ఈ డేటాబేస్‌కు ఎలాంటి పాస్‌వర్డ్ రక్షణ గానీ, ఎన్‌క్రిప్షన్ గానీ లేదు. ఇందులో కేవలం యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు మాత్రమే కాకుండా, అకౌంట్‌లోకి నేరుగా లాగిన్ అవ్వడానికి ఉపయోగపడే యూఆర్‌ఎల్ లింకులు కూడా ఉన్నట్లు ఫౌలర్ తెలిపారు. సాధారణ ప్రజల వివరాలే కాకుండా, వివిధ దేశాలకు చెందిన ‘.స్త్రశీజ‘ డొమైన్ల లాగిన్ వివరాలు కూడా లీక్ కావడం అత్యంత ఆందోళనకరమైన విషయమన్నారు. దీనివల్ల ప్రభుత్వ నెట్‌వర్క్‌లలోకి చొరబడటం, సైబర్ దాడులు చేయడం వంటి జాతీయ భద్రతకు సంబంధించిన ముప్పులు పొంచి ఉన్నాయని నివేదిక పేర్కొంది.

## లక్షల ఖాతాల వివరాలు లీక్

జీమెయిల్‌కు సంబంధించి సుమారు 4.8 కోట్ల ఖాతాల యూజర్లు, యాహూకు సంబంధించి 40 లక్షల ఖాతాల వివరాలు, ఫేస్‌బుక్‌కు సంబంధించి 1.7 కోట్ల ఖాతాల క్రెడెన్షియల్స్, అవుట్‌లుక్‌కు సంబంధించి 15 లక్షల ఖాతాలు, ఇన్‌స్టాగ్రామ్‌కు సంబంధించి 65 లక్షల ఖాతాల వివరాలు లీకైనట్లు నివేదిక స్పష్టం చేసింది. ఇవేకాకుండా ఇతర అనేక ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన వివరాలు కూడా ఈ డేటాలో ఉన్నట్లు తెలుస్తోంది.

## పొంచి ఉన్న ప్రమాదం

ప్రభుత్వ నెట్‌వర్క్‌ల లాగిన్ వివరాలు లీకైన నేపథ్యంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అకౌంట్ హ్యాక్ చేయడం వల్ల రహస్య హ్యాకర్‌కు లభించకపోవచ్చు కానీ, ఒక ఉద్యోగి అకౌంట్ హ్యాకర్ల చేతికి వెళితే అతని ఉన్న క్రెడెన్షియల్స్‌ను వాడుకొని సంస్థగతమైన వివరాలను చోరీ చేసే అవకాశం ఉంటుంది. లీక్ అయిన వివరాలతో హ్యాకర్లు ప్రభుత్వ అధికారుల్లా ఇతర అధికారులకు మెయిల్స్ పంపవచ్చు. దీని ద్వారా ప్రభుత్వ నెట్‌వర్క్‌లనే హ్యాక్ చేసే ప్రమాదం ఉంది. ఇది జాతీయ భద్రత, ప్రజల రక్షణకు పెద్ద ముప్పు అని ఫౌలర్ హెచ్చరించారు. చాలా మంది వినియోగదారులకు తమ సమాచారం దొంగిలించబడిందనే విషయం కూడా తెలియదు. ఇంత భారీ స్థాయిలో పాస్‌వర్డ్‌లు లీక్ కావడం వల్ల వారి వ్యక్తిగత భద్రత ప్రమాదంలో పడిందని చెప్పాలి. పాస్‌వర్డ్స్ కాకుండా, నేరుగా అకౌంట్ ఓపెన్ చేసే యూఆర్‌ఎల్ లింకులు కూడా లీక్ కావడంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి అతి తక్కువ సమయంలో వేల అకౌంట్లలోకి హ్యాకర్లు చొరపడటానికి అవకాశం ఉంది. ఈ లీకేజీ వల్ల బ్యాంకింగ్, క్రిప్టో ఖాతాలూ ప్రమాదంలో పడినట్లు ఫౌలర్ తెలిపారు. బ్యాంకింగ్ లాగిన్‌లు, క్రెడిట్ కార్డ్ వివరాలు, ఫైనాన్షియల్ సర్వీసెస్ అకౌంట్లు, క్రిప్టో వాలెట్లు, ట్రేడింగ్ ఖాతాలు కూడా లీకేజీ జాబితాలో ఉన్నట్లు ఫౌలర్ వెల్లడించారు. “లీకైన వాటిలో యూజర్ల యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు ఉన్నాయి. ఆన్‌లైన్ సేవలతో పాటు దాదాపు అన్ని రకాల అకౌంట్లకు సంబంధించిన క్రెడెన్షియల్స్ లీక్ అయ్యాయి. ప్రభుత్వ డొమైన్లు కూడా లీక్ అయ్యాయి. తద్వారా ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న ప్రతి అకౌంట్ ద్వారా కీలక వ్యవస్థల్లో హ్యాకర్ ప్రవేశించవచ్చు. లీక్ అయిన ప్రభుత్వ అధికారుల లాగిన్ వివరాలను ఉపయోగించి నిర్దిష్ట వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులు చేసే అవకాశం ఉంది. ‘.స్త్రశీజ‘ డొమైన్ వివరాలు లీక్ అవ్వడం అనేది జాతీయ భద్రతకు ముప్పు అని చెప్పాలి“ అని సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జెరెమియా ఫౌలర్ అన్నారు.

# ఫ్యాటీ లివర్ ఉన్నవారు ఏయే ఆహారాలను తీసుకోవాలి.. వేటికి దూరంగా ఉండాలి..



మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి. మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరం నుండి వ్యర్థాలను తొలగించడం, పైత్యరసం ఉత్పత్తి చేయడం, జీవక్రియలను నియంత్రించడం, పోషకాలను నిల్వ చేయడం,రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడం, సమతుల్య అంతర్గత వాతావరణాన్ని కాపాడడం వంటి ముఖ్యమైన విధులను కాలేయం నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం ఏ మాత్రం దెబ్బతిన్నా కూడా శరీర ఆరోగ్యం మొత్తం దెబ్బతింటుంది. అయితే ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యతో బాధపడే వారి సంఖ్య కాలక్రమేణా పెరుగుతుందనే చెప్పవచ్చు. చక్కెర కలిగిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం, ఊబకాయం, క్యాలరీలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని వైద్యులు చెబుతున్నారు.

## వేడి చేసిన నూనె..

ఫ్యాటీ లివర్ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలేయ వాపుతో పాటు మరింత తీవ్రనష్టం కలిగే అవకాశం ఉంది. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఆహారం పాత్ర ఎంతో ఉంది. సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం వల్ల కాలేయంలో పేరుకుపోయిన కొవ్వు కరిగి ఫ్యాటీ లివర్ సమస్య తగ్గుతుంది. ఇక ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారు తీసుకోవాల్సిన, తీసుకోకూడని ఆహారాల గురించి, ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించే ఇతర చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. కాలేయంలో కొవ్వు సమస్యతో బాధపడే వారు మళ్లీ మళ్లీ వేడి చేసిన నూనెను వాడకూడదు. వేడి చేయడం వల్ల హానికారక సమ్మేళనాలు ఉత్పత్తి అవుతాయి. దీంతో కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే ప్రాసెస్డ్, ప్యాక్ చేసిన ఆహారాలను తీసుకోకూడదు. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. వీటిలో అనారోగ్యకరమైన సంకలనాలు, చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి బరువు పెరిగేలా చేయడంతో పాటు ఫ్యాటీ లివర్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి.

## మైదా ఆహారాలు..

అదే విధంగా మైదాతో తయారు చేసిన ఆహారాలు, బ్రెడ్, పేస్ట్రీస్ వంటి వాటిని తీసుకోవడం తగ్గించాలి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడంతో పాటు కాలేయంలో కొవ్వు పేరుకుపోయేలా కూడా చేస్తాయి. వీటితో పాటు శీతల పానీయాలకు కూడా దూరంగా ఉండాలి. ఇవన్నీ కూడా కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా హానిని కలిగిస్తాయి. కనుక ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారు ఈ ఆహారాలకు దూరంగా ఉండడం మంచిది. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకోవాలి. కాలేయంలో కొవ్వు సమస్యతో బాధపడే వారు ఆలివ్ నూనెను తీసుకోవాలి. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వులు కాలేయంలో కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. కాలేయ పనితీరుకు మద్దతును ఇస్తాయి.

## గింజలు..

బాదం, వాల్‌నట్స్, చియా గింజలు, అవిసె గింజలు వంటి వాటిని తీసుకోవాలి. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్స్, ఫైబర్ కాలేయ ఆరోగ్యానికి మద్దతును ఇస్తాయి. రోజంతా నీటిని ఎక్కువగా తాగాలి. శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం వల్ల కాలేయ పనితీరు సరిగ్గా ఉంటుంది. శరీరంలో వ్యర్థాలు బయటకు తొలగిపోతాయి. కాలేయంలో కొవ్వు సమస్యతో బాధపడే వారు ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడం చాలా అవసరం. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కాలేయంలో కొవ్వు చాలా వరకు కరుగుతుంది. అధికంగా మద్యం సేవించడం మానేయాలి. దీని వల్ల కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది.

## మందులు..

అలాగే మనం ఇతర అనారోగ్య సమస్యలకు వాడే మందులు కూడా కాలేయ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. కనుక మందులను వాడే విషయంలో వైద్యుడిని సంప్రదించడం అవసరం. వీటితో పాటు రోజూ 6 నుండి 8 గంటలు నాణ్యమైన నిద్ర పోయేలా చూసుకోవాలి. తగినంత విశ్రాంతి తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియలు మెరుగుపడతాయి. దీంతో మొత్తం శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ విధంగా తగిన ఆహారాలు తీసుకుంటూ చక్కటి దినచర్యను పాటించడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య నుండి చాలా సులభంగా బయటపడవచ్చు. అలాగే భవిష్యత్తులో కూడా ఈ సమస్య రాకుండా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# చక్కెర మన శరీరానికి ఎన్ని విధాలుగా చేటు చేస్తుందో తెలుసా..



మనం ఆహారంలో భాగంగా చక్కెరను కూడా తీసుకుంటూ ఉంటాం. టీ, కాఫీ వంటి వాటితో పాటు తీపి వంటకాల తయారీలో కూడా చక్కెరను విరివిగా ఉపయోగిస్తూ ఉంటాం. చక్కెరతో చేసే తీపి వంటకాలు చాలా రుచిగా ఉంటాయి, వీటిని అందరూ ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే చక్కెరను తీసుకోవడం వల్ల డయాబెటిస్ వంటి అనారోగ్య సమస్య ఒక్కటే వస్తుందని అందరూ భావిస్తూ ఉంటారు. కానీ చక్కెర మన శరీరంలో అన్ని అవయవాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్యంపై చక్కెర తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. గుండె, కాలేయం, మెదడు, చర్మం ఇలా అన్ని అవయవాలపై చక్కెర చెడు ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఈ లక్షణాలు మనకు వెంటనే కనిపించవు. కానీ కాలక్రమేణా మనం చక్కెర దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెర మన శరీరంలో వివిధ అవయవాలపై ప్రభావాన్ని ఎలా చూపిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

## క్యాన్సర్‌కు దారి తీస్తుంది..

మధుమేహానికి చక్కెర ఒకే ఒక కారణం కాకపోయినప్పటికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు. అధిక చక్కెరను తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. దీని వల్ల మధుమేహాన్ని నిర్వహించడం చాలా కష్టంగా మారుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల కళ్లు, మూత్రపిండాలు, నరాలు, గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. అదేవిధంగా చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. దీర్ఘకాలం పాటు ఉండే ఊబకాయం క్యాన్సర్ కు కూడా దారి తీస్తుంది. అధిక చక్కెర తీసుకోవడం వల్ల 60 నుండి 95 శాతం క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. కనుక చక్కెర తీసుకోవడం తగ్గించాలి. ఇక చక్కెరను తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి.

## లిపిడ్ ప్రొఫైల్..

రోజువారి చక్కెర పానీయాల వినియోగం లిపిడ్ ప్రొఫైల్ తో కూడా ముడిపడి ఉంటుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ ల ప్రమాదాన్ని పెంచుతుంది. మన శరీరంలో ఉండే కాలేయం చక్కెరలో ప్రధానమైన ఫ్రక్టోజ్ ను ప్రాసెస్ చేస్తుంది. అధికంగా చక్కెరను తీసుకోవడం వల్ల కాలేయ కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. ఇది ఫ్యాటీ లివర్ కు దారి తీస్తుంది, ఫైబ్రోసిస్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలోకి క్యాలరీలు ఎక్కువగా వచ్చి చేరతాయి, చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కూడా కలగదు. ఇది మనం అతిగా తినడాన్ని ప్రోత్సహిస్తుంది. అదనపు చక్కెర ఇన్సులిన్, లెప్టిన్ అనే హార్మోన్లకు కూడా అంతరాయాన్ని కలిగిస్తుంది. దీంతో శరీర బరువు పెరుగుతుంది. రక్తంలో చక్కెర పెరుగుదల, క్రాష్ లు న్యూరోట్రాన్స్ మిటర్ లను ప్రభావితం చేస్తుంది, మెదడులో వాపును పెంచుతుంది. తద్వారా మానసిక సమస్యలు తలెత్తే అవకాశం కూడా ఉంది.

## మెదడు ఆరోగ్యం..

చక్కెర తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది జ్ఞాపకశక్తి తగ్గేలా కూడా చేస్తుంది. చక్కెర ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మెదడు క్షీణత వేగవంతంగా జరుగుతుంది. అలాగే చక్కెరను అతిగా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ తో పాటు రక్తపోటు కూడా పెరుగుతుంది. ఇవి రెండూ కూడా మూత్రపిండాలపై తీవ్రప్రభావాన్ని చూపిస్తాయి. కాలక్రమేణా ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. అతిగా చక్కెరను తీసుకోవడం వల్ల మొటిమలు, చర్మంపై మంట, వృద్ధాప్య ఛాయలు ఎక్కువగా వస్తాయి. దంతాల సమస్యలు కూడా పెరుగుతాయి. చిగుళ్ల సమస్యలతో పాటు దంతాలు పుచ్చిపోవడం వంటివి కూడా జరుగుతాయి. ఇలా చక్కెర మన శరీరంలో ఉండే అన్ని అవయవాలపై చెడు ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కనుక చక్కెర, చక్కెర ఉండే ఆహారాలను, శీతల పానీయాలను తక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.




# 68 ఏళ్ల వయసులోనూ 'బోర్డర్ 2' హీరో పవర్‌ఫుల్ ఫిట్ నెస్! అసలు సీక్రెట్ ఇదే

ఆయన వెండితెరపై డైలాగ్ చెబితే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు రావాల్సిందే.. ఆయన గంభీరమైన వాయిస్ వింటే శత్రువుల గుండెల్లో వణుకు పుట్టాల్సిందే. ఒకప్పుడు 'బోర్డర్' సినిమాలో దేశభక్తిని రగిలించి, దశాబ్దాల తర్వాత 'గదర్ 2' తో ఇండియన్ సినిమా రికార్డులను తిరగరాసిన స్టార్ ఆయన.ఆ మాస్ హీరోకు ఇప్పుడు 68 ఏళ్లు. కానీ ఆయన లుక్స్ చూస్తే మాత్రం 30 ఏళ్ల యువకుడిలా కనిపిస్తారు. వయస్సు కేవలం అంకె మాత్రమే అని నిరూపిస్తూ, నేటి తరం కుర్ర హీరోలకు కూడా సాధ్యం కాని ఫిట్?నెస్?తో ఆయన అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అసలు ఈ వయసులో కూడా ఆయన అంత యాక్టివ్?గా ఉండటానికి కారణం ఏంటి? ఆయన రోజువారీ దినచర్యలో పాటిస్తున్న ఆ కఠినమైన సూత్రాలేంటి? 'బోర్డర్ 2' తో రికార్డులను తిరగరాస్తున్న సన్నీ డియోల్? ఫిట్?నెస్ సీక్రెట్స్ ఏంటో తెలుసుకుందాం.

**పక్కా ప్లానింగ్..**

సన్నీ డియోల్ తన ఫిట్?నెస్?కు ప్రధాన కారణం వ్యాయామంతో పాటు తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం అని చెబుతారు. ఫుడ్ విషయంలో ఆయన చాలా స్ట్రిక్ట్ డైట్ ఫాలో అవుతారు. ముఖ్యంగా ఈ హీరో నాన్-వెజ్ ఆహారానికి పూర్తిగా దూరంగా ఉంటారు. బయట దొరికే జంక్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లరు. తన డైట్?లో రోజూ యోగర్ట్, యాపిల్స్ ఉండేలా చూసుకుంటారు. పంజాబీ మూలాలు ఉన్న ఆయనకు లస్సీ, వెన్న అంటే చాలా ఇష్టమట. ముఖ్యంగా ఇంట్లో తయారుచేసిన మెంతి పరోటాలను ఆయన ఎంతో ఇష్టంగా తింటానని పలు సందర్భాల్లో వెల్లడించారు.

**వ్యాయామం -- ఒక వ్యసనం..**

సన్నీ డియోల్ ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఒకటి లేదా రెండు గంటలు కఠినమైన వ్యాయామం చేస్తారు. వర్కౌట్స్ చేయడం తనకు ఒక వ్యసనం లాంటిదని ఆయన చెబుతారు. "ఒక్క రోజు జిమ్ మిస్ అయినా నాకు చాలా నీరసంగా అనిపిస్తుంది" అని సన్నీ పేర్కొన్నారు. జిమ్?లో వెయిట్ ట్రైనింగ్?తో పాటు కార్డియో వ్యాయామాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం 6 గంటలకే నిద్ర లేవడం వల్ల రోజు మొత్తం ఎనర్జిటిక్?గా ఉండటమే కాకుండా, రాత్రుళు ప్రశాంతమైన నిద్ర సొంతమవుతుందని ఆయన నమ్ముతారు. కేవలం జిమ్ వర్కౌట్లతోనే కాకుండా యోగా ద్వారా కూడా సన్నీ తనను తాను ఫిట్?గా ఉంచుకుంటారు. రోజూ ఒక గంట పాటు తప్పనిసరిగా ప్రాణాయామం చేయడం ఆయన అలవాటు. దీనివల్ల వాయిస్?లో బేస్ పెరగడమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గుతుందని ఆయన భావిస్తారు. ఈత కొట్టడం, నడక కూడా ఆయన దినచర్యలో ప్రధాన భాగాలు. ఇలా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బ్యాలెన్స్ చేయడం వల్లే 70 ఏళ్లకు చేరువలో ఉన్నా ఆయన ఇప్పటికీ ఎంతో హ్యాండ్సమ్?గా కనిపిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితం ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ఫిట్?గా ఉండొచ్చని సన్నీ డియోల్ నిరూపిస్తున్నారు.

# మల్లెపూల' సైకో కిల్లర్.. ఓటీటీ టాప్ ట్రెండింగ్ లో నయా క్రైమ్ థ్రిల్లర్..




ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఈ శుక్రవారమే (జనవరి 23) ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చింది. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా సాగే ఈ తెలుగు మూవీ కేవలం ఒకే ఒక్క రోజులోనే ఓటీటీ టాప్ వన్ ట్రెండింగ్ లోకి దూసుకెళ్లిపోయింది. ఎప్పటిలాగే ఈ శుక్రవారం (జనవరి 25) పలు కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ లు స్ట్రీమింగ్ కు వచ్చాయి. తెలుగుతో పాటు వివిధ భాషలకు చెందిన సినిమాలు, సిరీస్ లు ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ పై సందడి చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఓటీటీలో ఎక్కువగా క్రైమ్ థ్రిల్లర్ తరహా సినిమాలకే ఎక్కువగా ఆదరణ దక్కుతోంది. ఈ నేపథ్యంలో ఒక తెలుగు క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇప్పుడు ఓటీటీలో టాప్ వన్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. ప్రస్తుతం ఓటీటీ ఆడియెన్స్ ఎక్కువగా ఈ మూవీ గురించే మాట్లాడుతున్నారు. ఈ సినిమా కథ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఆద్యంతం ఆసక్తికరమైన కథ కథనాలు, ఉత్కంఠభరిత సన్నివేశాలు, ఊహకు అందని ట్విస్టులతో ఆడియెన్స్ కు సరికొత్త థ్రిల్ ను అందిస్తోందీ సినిమా. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంధ్య నెల్లూరు అనే అమ్మాయి ఓ న్యూస్ ఛానెల్?లో క్రైమ్ స్టోరీస్?కు యాంకర్?గా వర్క్ చేస్తుంటుంది. టీఆర్?పీల కోసం కాకుండా నిజాలను చూపించాలని సంధ్య ఆరాటపడుతుంది. అయితే తాను అనుకున్నట్లు న్యూస్ ఛానెల్ లేకపోవడంతో సొంతగా ఓ పాడ్ కాస్ట్ స్టార్ట్ చేస్తుంది. అదే సమయంలో సంధ్య ఉన్న సిటీలోనే వరుస అత్యాచారాలు, హత్యలు జరుగుతాయి. వీటిపై కూడా పాడ్ కాస్ట్ చేస్తుంది సంధ్య. దీంతో ఆ సైకో కిల్లర్ సంధ్యను కూడా వెంబడిస్తాడు. మరి ఈ సీరియల్ కిల్లింగ్స్ కు కారణమెవరు? అసలు ఎందుకీ హత్యలు చేస్తున్నాడు? సంధ్య సైకో కిల్లర్ ను పట్టుకుందా? లేదా? అన్నది తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఈ సైకో థ్రిల్లర్ మూవీ పేరు చీకటిలో. అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ్ల ఇందులో మెయిన్ లీడ్ చేసింది. అలాగే ప్రేమ కావాలి సినిమాలో హీరోయిన్?గా చేసిన ఇషా చావ్లా చాలా కాలం తర్వాత మళ్లీ స్క్రీన్ పై కనిపించింది. అలాగే సీనియర్ నటి ఆమని మరో కీలక పాత్రలో యాక్ట్ చేసింది. ఈ సినిమాకు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. జనవరి 23 నుంచి అమెజాన్ ప్రైమ్? ఓటీటీలో చీకటిలో మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతోపాటు తమిళం, హిందీ వంటి 3 భాషల్లోనూ ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. అయితే ఓటీటీ రిలీజ్ రోజు నుంచే అమెజాన్ ప్రైమ్?లో

# స్విమ్మింగ్ లో నేషనల్ ఛాంపియన్.. ఇప్పుడు టాలీవుడ్ క్రేజీ హీరోయిన్.. ఎవరో గుర్తు పట్టారా?




ఈ టాలీవుడ్ హీరోయిన్ మల్టీ ట్యాలెంటెడ్. చిన్నప్పటి నుంచి ఎక్స్ ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ లో బాగా చురుగ్గా పార్టిసిపేట్ చేసింది. ముఖ్యంగా స్విమ్మింగ్ లో స్టేట్ అండ్ నేషనల్ లెవెల్ పోటీల్లో సత్తా చాటింది. ఎన్నో పతకాలు కూడా సొంతం చేసుకుంది ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ నడుస్తోంది. అదేంటంటే సడన్?గా అందరూ పదేళ్లు వెనక్కు వెళ్లిపోతున్నారు. అంటే తమ 2016లో జీవితం ఎలా ఉందో గుర్తు చేసుకుంటున్నారు. అప్పటి సంగతులు, మధుర జ్ఞాపకాలను ఫొటోలు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలో షేర్? చేస్తున్నారు. పలువురు సినిమా తారలు కూడా '2016.. నోస్టాల్జిక్ వైబ్స్' అంటూ పదేళ్ల క్రితం నాటి ఫొటోలు, వీడియోలను పంచుకుంటున్నారు. దీంతో ఇప్పుడు చ2016 హ్యాష్ ట్యాగ్ ఇప్పుడు నెట్టింట బాగావైరలవుతోంది. ఈ నేపథ్యంలో ఒక ప్రముఖ హీరోయిన్ తన పదేళ్ల క్రితం నాటి ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసుకుంది. దీంతో ఆ ఫొటోలు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ఎందుకంటే అప్పటికీ, ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ బాగా మారిపోయింది. దీంతో చాలా మంది ఈ హీరోయిన్ ను గుర్తు పట్టలేకపోతున్నారు. ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. మరి ఇంతకీ ఈ ఫొటోల్లో ఉన్నదెవరో గుర్తు పట్టారా ఈ ఫొటోల్లో ఉన్నది ఒక సౌతిండియన్ క్రేజీ హీరోయిన్. అయితే ఆమెకు పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు ఉంది. అలాగనీ ఆమె పాతిక, ముప్పై సినిమాలేమీ చేయలేదు. ఇప్పటివరకు కలిపి అన్ని భాషల్లో కేవలం 5 సినిమాల్లోనే నటించింది. అందులో రెండు ఏకంగా పాన్ ఇండియా సినిమాలే. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే.. హీరోయిన్ గా నటించిన రెండో సినిమాతోనే రూ. 450 కోట్లు రాబట్టిందీ అందాల తార. ఇక సినిమాల్లోకి రాకముందు ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ చేసింది ముద్దుగుమ్. ఇంజినీరింగ్ చదివిన ఈ అందాల తార కొన్ని రోజుల పాటు యాక్సెంచర్ కంపెనీలో అసోసియేట్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేసింది. అయితే నటనపై మక్కువతో సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఇంతకీ ఈ బ్యూటీ ఎవరనుకుంటున్నారా? కాంతారా ఫేమ్ సప్తమి గౌడ. బెంగళూరులో పుట్టి పెరిగిన సప్తమి గౌడ 2020లో సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. పాప్ కార్న్ మంకీ టైగర్ అనే సినిమాలో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.




# స్నేహ, మెట్టెల సవ్వడి సీరియల్స్ నటి గుర్తుందా ఇప్పుడేంటిలా మారిపోయింది వీడియో వైరల్

విధి, లేడీ డిటెక్టివ్, అన్వేషిత, తరంగాలు, ఎండమావులు.. 1990లో బుల్లితెర ప్రేక్షకులను అమితంగా అలరించిన టీవీ సీరియల్స్ ఇవి. వీటిలో నటించిన వారు కూడా ఇప్పటికీ మన కళ్ల ముందు మెదులుతుంటారు. అలా 1990లో ఈటీవీలో ప్రసారమైన 'స్నేహ' సీరియల్ కూడా చాలా మందికి ఫేవరెట్. 'స్నేహ.. స్నేహ.. స్నేహ.. చిక్కు ముడుల్లోన్నే చక్కగా విప్పే ఒకే ఒక వనిత'.. ఈ తరం జనరేషన్ కు ఈ సాంగ్ పెద్దగా తెలియకపోవచ్చు.. కానీ 1990 లో బుల్లితెర ఆడియెన్స్ కు బాగా దగ్గరైన పాట ఇది. ఈటీవీలో ప్రసారమైన 'స్నేహ' సీరియల్ సాంగ్ ఇది. ఇందులో స్నేహ పాత్రలో కావేరి అనే నటి యాక్ట్ చేసింది. వంశీ తెరకెక్కించిన ఈ సీరియల్ ను ఉషా కిరణ్ మూవీస్ పతాకంపై రామోజీ రావు నిర్మించారు. సుమారు 200 ఎపిసోడ్లకు పైగా ప్రసారమైన ఈ సీరియల్ చాలా మందికి ఫేవరెట్ అని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఈ సీరియల్ బాగా ఆకట్టుకుంది. అందులోనూ స్నేహ పాత్రలో కనిపించిన కావేరీ నటనకు అందరూ ముగ్ధులయ్యారు. స్నేహ తర్వాత కొన్ని తమిళ సీరియల్స్ లో నటించింది కావేరి. అలాగే కొన్ని తమిళ సినిమాల్లోనూ యాక్ట్ చేసింది. తెలుగులోనూ చిన్నారి ముద్దుల పాప, సాహసం (ఓల్డ్) చిత్రాల్లో నటించిందీ ముద్దుగుమ్మ. ఇక ఆమె చివరిగా విజయ్ కాంత్ నటించిన సేతుపతి ఐపీఎస్ సినిమాలోయాక్ట్ చేసింది. సినిమాలలో కంటే బుల్లి తెరపై ఎక్కువగా కాలం కనిపించిన కావేరి 15 సీరియళ్లలో నటించింది.

కాగా కావేరి రాకేష్ అనే బిజినెస్ మ్యాన్ ను ప్రేమించి వివాహం చేసుకుంది. 2013లో వీరి వివాహం జరిగింది. ఇంట్లో ప్రేమ వివాహానికి ఒప్పుకోక పోయేసరికి పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంది. కాగా ఒకప్పుడు బుల్లితెరపై చాలా ముద్దుగా, బొద్దుగా, చలాకీగా కనిపించిన కావేరి ఇప్పుడు గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. ప్రస్తుతం సినిమాలు, సీరియల్స్ కు దూరంగా ఉంటోన్ ఆమె ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్ కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఇందులో ఆమె చాలా సన్నగా కనిపించింది. మొదట చాలా మంది ఆమెను గుర్తు పట్టలేదు. అయితే ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని షాక్ అవుతున్నారు.

ఆ కారణంతోనే ఇలా సన్నగా.. 'ఓ సీరియల్ చేస్తున్న సమయంలోనే మా అమ్మ చనిపోయింది. అప్పుడే నాకు పెళ్లి అయ్యింది. అదే సమయంలోనే నాకు థైరాయిడ్ సోకింది. దీనికి తోడు సోదరుడు చనిపోవడంతో కాస్త డిప్రెషన్ లోకి వెళ్లాను. అందుకే అలా లావు పెరిగిపోయాను. ఇప్పుడు థైరాయిడ్ టాబ్లెట్స్ ఆపేయడంతో బరువు తగ్గుతూ వస్తున్నాను. మళ్లీ ఆఫర్స్ వస్తే సీరియల్స్ చేయడానికి రెడీ' అని అంటోంది కావేరి.

# థియేటర్ లో అలా రీల్ చేసినందుకు.. విజయ్ అభిమానిని చితక్కొట్టిన అజిత్ ఫ్యాన్స్.. వీడియో వైరల్





తమిళ చిత్ర పరిశ్రమలో తలా అజిత్ కుమార్, దళపతి విజయ్ అభిమానుల మధ్య ఉండే పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొన్ని సార్లు ఈ పోటీ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఎంతలా అంటే ఒక హీరో అభిమాని మరో హీరో అభిమానిపై దాడి చేసేలా. గతంలో ఇది సార్లు చాలా జరిగింది. ఇప్పుడు మరోసారి అది పునరావృతమైంది. వివరాల్లోకి వెళితే.. అజిత్ కుమార్ నటించిన మంగత్తా (తెలుగులో గ్యాంబ్లర్) సినిమా మళ్లీ థియేటర్లలో రిలీజైంది. ఈ సినిమా చూడటానికి అజిత్ అభిమానులు భారీగా తరలి వస్తున్నారు. తమిళనాడులోని పెద్ద ఎత్తున థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శితమవుతోంది. ఈ క్రమంలోనే విజయ్ అభిమాని ఒకరు కూడా ఈ సినిమా చూసేందుకు థియేటర్ కు వచ్చాడు. అయితే సినిమా ప్రదర్శిస్తోన్న సమయంలో అతను టీవీకే పార్టీ జెండాను పట్టుకుని హల్ చల్ చేశాడు. ఇన్ స్టాగ్రామ్ లో రీల్స్ చేసేందుకు ప్రయత్నించాడు. ఇది అజిత్ అభిమానులకు బాగా కోపం తెప్పించింది. అంతే.. టీవీకే జెండాను పట్టుకుని రీల్స్ చేస్తోన్న విజయ్ అభిమానిని థియేటర్ నుంచి బయటకు తీసుకొచ్చి చితక్కొట్టారు అజిత్ అభిమానులు. దీనిని చాలా మంది తమ సెల్ ఫోన్ కెమెరాలో రికార్డు చేసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. సినిమాలకు దూరమైన దళపతి విజయ్ ఇప్పుడు రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా మారిపోయారు. టీవీకే పార్టీని స్థాపించిన ఆయన ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. ఈక్రమంలోనే అభిమానులు కూడా ఆయనకు పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నారు. టీవీకే పార్టీ జెండా పట్టుకుని తిరుగుతున్నారు. అదే ఇప్పుడు గొడవకు కారణమైంది.

## ఘనంగా ఆరే మరాఠి సంఘం

# కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం...






ఆదిలాబాద్/**ఆకాంక్ష జనవరి 25:** ఇచ్చోడ మండల కేంద్రంలో ఆరే మరాఠి సంఘం కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించుకున్నారు... అడెగామా(బి) రోడ్డులో ఏర్పాటు చేసుకున్న సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించుకున్నారు .. కుల పెద్దలు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరే మరాఠి సంఘం ఇచ్చోడ అధ్యక్షులు సాయికిరణ్ జాధవ్,ఉపాధ్యక్షులు పాన్పట్టే సుభాష్, అశోక్ భోస్లే, పరమేశ్వర్ షిండే, తానాజీ థోరే, జనరల్ సెక్రటరీ పౌడే అనిల్,కోశాధికారులు గైక్వాడ్ జ్ఞానేశ్వర్, మెండల్కర్ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ చంద్రకాంత్ కదం, శ్యామ్ దుక్రే, దినేష్ గైక్వాడ్, కదం శంకర్, రాము జాధవ్, శివకాంత్ కదం , సభ్యులు పాన్పట్టే సాయికృష్ణ, సందీప్ కదం అడ్వైసర్ కమిటి సభ్యులు శంకర్ పాటిల్ ఖరే, సూర్యకాంత్ పాటిల్ చౌహాన్, మనోహర్ పాటిల్ దుక్రే, సుదర్శన్ పాటిల్ కదం,గంగాధర్ పాటిల్ షిండే అరుణ్ పాటిల్ అగ్లవే, కొండిరాం పాటిల్ కదం, కిషన్ పాటిల్ షిండే,ఖోబా పాటిల్ కదం తదితరులు పాల్గొన్నారు..

## మంథని నుండి మేడారంకు ప్రారంభమైన ప్రత్యేక బస్సులు....



మంథని/**ఆకాంక్ష జనవరి 25:** మంథని నుండి మేడారం మహా జాతరకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక బస్సులను ప్రారంభమయ్యాయి. మహా జాతర ప్రత్యేక బస్సులను అధికారులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మంథని నుండి మేడారంకు పెద్దలకు రూ. 350, పిల్లలకు రూ. 210 చార్జి ఉంటుందన్నారు. మహా జాతర ప్రత్యేక బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. టీజీఎస్ఆర్టిసి బస్సులు సమ్మక్క సారలమ్మ గద్దెల దగ్గరి వరకు వెళుతాయని, ప్రవేట్ వాహనాలు గద్దెలకు దూరంగా వెళ్తాయని పేర్కొన్నారు. భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ ఏంజెల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ గోపాల్, గణేష్, కెఆర్ రావ్, జగదీష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకారపు శివాలయంలో

# శివదీక్ష స్వాములకు అన్నప్రసాద పంపిణీ...



నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 25:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న ఆకారపు శివాలయంలో రథసప్తమి ఆదివారం భక్తిశ్రద్ధలతో శివదీక్ష స్వాములకు మడితో కూడిన అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆకారపు వంశీయులు ఈ పుణ్యకార్యానికి శ్రీకారం చుట్టగా, శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆకారపు వంశీయులు మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం శివదీక్ష గురు స్వామి స్వయంగా వండిన మడితో కూడిన అన్నప్రసాదాన్ని శివదీక్ష స్వాములకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శివదీక్షలో ఉన్న భక్తులకు శుద్ధి, నియమం, భక్తి ప్రధానంగా భావించి మడి అన్నప్రసాదాన్ని అందజేస్తున్నామని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమం ద్వారా శివభక్తుల మధ్య ఆధ్యాత్మిక భావన మరింత బలపడుతుందని వారు తెలిపారు. ఈ అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో ఆకారపు శంకరయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు బి. వేణుగోపాల్, రామస్వామి, సాయిరాం, ఆకారపు స్వప్న, గిరి, గౌడ్, శివ స్వాములు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శివనామ స్మరణతో, భక్తిగీతాల నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో ఉట్టిపడింది. శివదీక్ష స్వాములు ఈ ఏర్పాట్లకు ఆకారపు వంశీయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాగర్ కర్నూల్ జిల్లా సెర్ప్

# ఉద్యోగుల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక ...




నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 25:** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ( సెర్ప్) ఎల్1మరియు ఎల్2 ఉద్యోగుల యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గం ను ఆదివారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షురాలిగా చారకొండ మండల మహిళ సమాఖ్య సిసి యస్ కె జరీనా ,జిల్లా ఉపాధ్యక్షులు గా డీఎంజీ శ్యామ్ సుందర్, బల్మూర్ మండల సమాఖ్య సిసి జైహింద్,ప్రధాన కార్యదర్శి గా నాగర్ కర్నూల్ క్లస్టర్ కోఆర్డినేటర్ కే.రాములు, సహాయ కార్యదర్శిగా ఊర్కొండ సిసి ఏ.రామస్వామి, కోశాధికారిగా తెలకపల్లి మండల సమాఖ్య సిసి నర్సింహా,ప్రధాన సలహా దారులు గా ఆలూరి చెన్నయ్య డీపీఎం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆలూరి చెన్నయ్యతెలిపారు.వివిధ మండలాల నుండి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి చైర్మన్ పీఠమే తెలంగాణ జాగృతి గమ్యం...



పెద్దపల్లి టౌన్/**ఆకాంక్ష జనవరి 25:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలను టార్గెట్‌గా చేసుకుని తెలంగాణ జాగృతి నిర్ణయాత్మక శక్తిగా అవతరించబోతోందని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో చైర్మన్ పదవిని ఖచ్చితంగా కైవసం చేసుకుంటామనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా పోరాడిన ఉద్యమకారుల నాయకత్వం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలే తెలంగాణ జాగృతికి బలమని ఆయన తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలన, పారదర్శకత, సమగ్ర అభివృద్ధే తెలంగాణ జాగృతి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే విధానంతో ముందుకు సాగుతున్నందున ప్రజల్లో తెలంగాణ జాగృతిపై విశ్వాసం పెరుగుతోందని అన్నారు.మున్సిపల్ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టత, పారిశుధ్య నిర్వహణ, పట్టణ పరిశుభ్రతతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై స్పష్టమైన కార్యాచరణతో ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. పట్టణాల అభివృద్ధి కోసం ప్రజాభిప్రాయాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకునే ప్రజాస్వామ్య పాలనను అందిస్తామని హామీ ఇచ్చారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ జాగృతి ఘన విజయం సాధించి, చైర్మన్ పీఠాన్ని అధిరోహించడం ఖాయమని బండారి శ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# రామంతాపూర్ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం...

## ఉత్సాహంగా పర్యటించిన డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్...





ఉప్పల్/**ఆకాంక్ష జనవరి 25:** మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని రామంతాపూర్ డివిజన్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి గడప వద్ద ప్రజలతో మమేకమై వారి అవసరాలు, ఇబ్బందులు వినిపించారు.పర్యటన సందర్భంగా రామంతాపూర్ ప్రాంతంలో నెలకొన్న పలు ప్రధాన సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రామంతాపూర్ చిన్న చెరువు మురికి చెరువుగా మారడంతో పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రమైందని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యల కారణంగా మంచినీళ్లు మురికి నీళ్లుగా మారుతున్నాయని, ఈ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశాలపై వెంటనే స్పందించిన డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ, రామంతాపూర్‌లో ఉన్న అన్ని సమస్యలను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి మొహమ్మద్ తోఫిక్, రామంతాపూర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంధ్యారాణి, మొగిలి లింగం, గంగపుత్ర భాస్కర్, అంగాల సందీప్, మెట్టు గౌడ్, హరీష్ గౌడ్, టబ్బుస్సుమ్ బేగం, లఘుసాని శ్రీనివాస్ గౌడ్, కేబుల్ అశోక్, నరసింహ, మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శులు సచిన్ తోట, శంకర్, ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ షకీల్, రాజ్‌కుమార్, రవి, సూరి, ఐకాన్, ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి స్వామి శివ సదన్ కుమార్, మమ్మద్ నయీమ్, చోటు బాయ్, శివరాక్, ఎండీ జాంగిర్, ఎన్ఎస్‌యూఐ సాయి తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సూర్యనారాయణ హోమం,అభిషేక పూజలు...





నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 25:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేకంగా సూర్య దేవునికి అభిషేక పూజలు సూర్యనారాయణ హోమం శాస్త్రోక్తంగా వేద మంత్ర చరణాల మధ్య నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.సూర్యనారాయణ హోమాన్ని ఆలయ అర్చకులు కందాడై శ్రీనివాసచార్యులుప్రత్యేకంగా నిర్వహించారు. భక్తులచే సామూహికంగా సూర్యనారాయణ స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేక పూజలు ఆయన నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే అల్పాహారం భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్, గొల్ల రాములు,టి.మల్లేష్, మన్యపు రెడ్డి, రమాదేవి,శారద, శివ, పాండు,నందకిషోర్ భక్తులు మహిళలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణులకు

# వరం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



మిడ్జిల్ / **ఆకాంక్ష జనవరి 25:** గ్రామీణ పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం నిదర్శనమని జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. మిడ్జిల్ మండలంలోని లింబ్యా తండాలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ఆదివారం ఆయన ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఈ పథకం ఒక వరంగా మారిందని తెలిపారు. పేద కుటుంబాలు సురక్షితంగా, ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథక ఉద్దేశమని అన్నారు.లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించు కోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ చైర్‌పర్సన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వడ్కాపూర్‌లో 'చంద్రన్న'కు ఘన స్వాగతం...

### 45 ఏళ్ల నిరీక్షణకు తెర...

### సొంత గూటికి చేరుకున్న పుల్లూరి ప్రసాద్ రావు.. మరి



పెద్దపల్లి/**ఆకాంక్ష జనవరి 25:** సుదీర్ఘకాలం అజ్ఞాతవాసంలో గడిపిన అనంతరం ఇటీవల జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు (అలియాస్ చంద్రన్న) ఆదివారం తన సొంత గ్రామమైన వడ్కాపూర్‌కు చేరుకున్నారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల తర్వాత స్వగ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు, బంధువులు ఆత్మీయ స్వాగతం పలికారు.గ్రామంలో అడుగుపెట్టిన వెంటనే చంద్రన్నను చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామ సర్పంచ్ పుల్లూరి ప్రశాంతి వేణుగోపాలరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది.సన్మాన కార్యక్రమంలో చంద్రన్న భావోద్వేగంగా మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం 45 ఏళ్లుగా అడవి బాట పట్టి ఉద్యమ జీవితం గడిపానని, ఇటీవల పోలీసులకు లొంగిపోయి జనజీవనంలోకి వచ్చిన అనంతరం మళ్లీ సొంత గడ్డపై అడుగుపెట్టడం అపూర్వ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇన్నేళ్ల తర్వాత గ్రామస్తులు, బంధువులను కలవడం తన జీవితంలో మరిచిపోలేని క్షణమని పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం చంద్రన్న తన చిన్ననాటి విద్యాభ్యాసం చేసిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులను పరిశీలిస్తూ బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి మిత్రులు, బంధువులను పేరుపేరునా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బాల్యమిత్రులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కు దేశ అభివృద్ధికి మార్గదర్శకం...

### తాసిల్దార్ ధీరజ్ కుమార్



ఓదెల/**ఆకాంక్ష జనవరి 25:** ఓటు హక్కు అనేది దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే శక్తివంతమైన ఆయుధమని ఓదెల తాసిల్దార్ ధీరజ్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఓటరు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించి మంచి పరిపాలన అందించే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలవాలంటే ఓటర్ల చైతన్యం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారుల పనితీరును ప్రశంసిస్తూ వారికి సత్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, గ్రామాలు, ప్రాంతాల అభివృద్ధికి సరైన నాయకులను ఎన్నుకునే శక్తి ఓటు ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత ఓటు హక్కుపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు రూపొందించిన రంగుల చిత్రాలు అధికారులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పావని రూపొందించిన చిత్రానికి తాసిల్దార్ ధీరజ్ కుమార్, ఎస్సై దీకొండ రమేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి జ్యోతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, రెవెన్యూ సిబ్బంది, కేజీబీవీ అధ్యాపక బృందం, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.




# మల్లాపూర్‌లో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు....

### స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి...



జడ్చర్ల/**ఆకాంక్ష జనవరి 25:** మిడ్జిల్ మండలం మల్లాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకోవడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. గ్రామ దేవాలయాలు ప్రజల ఆధ్యాత్మిక శక్తికి కేంద్రాలుగా నిలుస్తాయని, ఇలాంటి ఉత్సవాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, సాగునీటి రంగాల్లో విస్తృత అభివృద్ధి జరిగిందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పని చేస్తుందని, భవిష్యత్తులో కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతుందని అన్నారు.కళ్యాణోత్సవ కార్యక్రమాల అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కొత్తూరు గ్రామానికి వెళ్లి ఇటీవలి కాలంలో మృతి చెందిన మంగలి కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్టసమయంలో పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ సంధ్య బంగారు సహా మండలంలోని పలు గ్రామాల సర్పంచులు మాజీ మంత్రిని శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, నాగిరెడ్డి, గంజికృష్ణ, జంగారెడ్డి, కరాటే శ్రీను, ప్రతాప్ రెడ్డి, తిరుపతి నాయక్, నవీన్ చంద్ర రెడ్డి, గంజి శేఖర్, శ్రీనివాసులు, రామకృష్ణ, అంజిరెడ్డి, కృష్ణయ్య, మల్లేష్, ఆచారి, దశరథ్ చారితో పాటు సర్పంచులు సంధ్య బంగారు,చంద్రయ్య గౌడ్, మల్లేష్ తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హైస్కూల్లో

# ఘనంగా సైన్స్ ఫెయిర్2026 ప్రారంభం...

### బండారు శ్రీవాణి వెంకట్రావు చేతుల మీదుగా ఆవిష్కరణ...



ఉప్పల్/ **ఆకాంక్ష జనవరి 25:** రామంతపూర్ పరిధిలోని వెంకటరెడ్డి నగర్‌లో గల విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ 2026 కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు హాజరై, పాఠశాల చైర్మన్ వేములకొండ సోమశేఖర్, ప్రిన్సిపాల్, వేములకొండ రేణుకలతో కలిసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో, సృజనాత్మకతకు ప్రతీకగా రూపొందించిన అనేక ప్రయోగాత్మక సైన్స్ ఎగ్జిబిట్స్ వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చంద్రయాన్3, సోలార్ సిస్టమ్, లూనార్ ఎక్లిప్స్, నూతన పార్లమెంట్ భవనం, ఎర్త్ క్వేక్ అలారం, అయోధ్య రామ మందిరం, ఆపరేషన్ సింధూర్, డయాలసిస్ ప్రక్రియ, బ్లడ్ గ్రూప్స్, నీటి శుద్ధీకరణ యంత్రం, స్మార్ట్ సిటీ, గణిత శాస్త్ర ఉద్యానవనం, మెదడు పనిచేసే విధానం, అరణ్య వ్యవస్థ, మానవుడి జీవిత చరిత్ర, తెలుగు అక్షరాలతో రూపొందించిన శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటం వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు తయారు చేసిన మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ చూపరులను అబ్బురపరిచారు.



కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు పీవీ రాంనర్సయ్య, సూరం రామ్ రెడ్డి, వేములకొండ వెంకన్న గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, వీఎంహెచ్ సోమశేఖర్, కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీధర్, ఉపేందర్ నేత, శోభా రెడ్డి, వేములకొండ ఉపేందర్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు కల్మకళ్ల లింగం, శీలం సుధ, పులిగొండ నారాయణదాసు, చెల్లోజు ఎల్లా చారి, అంజయ్య పటేల్, తమ్ములి రవి, గోల్డ్ వెంకటేష్, పూజారి సోమయ్య, పెంటవల్లి వెంకన్న, పెంటాజీ, సంగప్ప, ఆది మల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు,విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చిన్నారుల మృతి ఘటనపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి...



జడ్చర్ల/**ఆకాంక్ష జనవరి 25:** ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో చోటుచేసుకున్న చిన్నారుల మృతి ఘటన జడ్చర్ల నియోజకవర్గాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. పొలం వద్ద సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత హృదయ విదారకమని జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె, కుమారుడు, సోదరి కుమార్తె ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం మాటల్లో చెప్పలేని దుఃఖకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం నింపారు.చిన్న వయసులోనే మూడు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఇలాంటి ఘటనలు ఎవరి జీవితంలోనూ జరగకూడదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై స్థానికులను అడిగి తెలుసుకున్న ఆయన, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో ఉన్న ప్రమాదకర గుంతలు, బావులు, చెరువులు, పొలాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.







# పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర ఘన విజయం...






ఓదెల/**ఆకాంక్ష జనవరి 25:** పుస్తక పాఠాలకు పరిమితం కాకుండా ప్రత్యక్ష అనుభవం ద్వారా విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో పీఎం శ్రీ పథకం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన శిక్షణాత్మక విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా ముగిసింది.42 మంది విద్యార్థినీవిద్యార్థులతో 2026 జనవరి 20 నుంచి 24 వరకు ఐదు రోజుల పాటు సాగిన ఈ ఎక్స్‌పోజర్ టూర్ విద్యార్థుల్లో చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, శాస్త్రీయ మరియు పర్యావరణ అవగాహనను గణనీయంగా పెంపొందించింది.తరగతి గదుల గడప దాటి దేశ వారసత్వాన్ని ప్రత్యక్షంగా చూసి, అనుభవించి నేర్చుకునే అరుదైన అవకాశం ఈ యాత్ర ద్వారా లభించిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఓంధా నాగనాథ్, గ్రిష్ణేశ్వర్, త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగాల దర్శనంతో శైవ సంప్రదాయంపై అవగాహన పెరిగింది. అజంతా ఎల్లోరా గుహల సందర్శనతో బౌద్ధ, హిందూ, జైన కళావాస్తు సమన్వయాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారు. దౌలతాబాద్ కోటలో ప్రాచీన రక్షణ వ్యవస్థలు, బీబీ కా మక్బరాలో మొఘల్ వాస్తు శైలి, శని శింగణాపూర్‌లో సామాజిక నమ్మకాలు, శిర్డీ సాయిబాబా ఆలయంలో సర్వమత సమానత్వ సందేశం విద్యార్థులను ప్రభావితం చేశాయి. సోమేశ్వర్ జలపాతాల వద్ద ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని, సులా వైన్ యార్డ్స్‌లో వ్యవసాయాధారిత పరిశ్రమలుఉపాధి అవకాశాలను తెలుసుకున్నారు. బాసర సరస్వతి దేవాలయం దర్శనం విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పగా, ఐఐఐటి బాసర సందర్శన ఉన్నత సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంచింది.ఈ విజ్ఞాన విహార యాత్రను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యేబూసి శ్రీనివాస్ నేతృత్వంలో ఉపాధ్యాయులు ఓద్నాల రామకృష్ణ, అమృత్ కిషోర్, గుగులోతు రవి, వేల్పుల హరికృష్ణ, కల్వల సంజీవ్ సమర్థంగా నిర్వహించారు. భోజనం, వసతి, ప్రయాణం, క్రమశిక్షణ, భద్రత అంశాల్లో పూర్తి జాగ్రత్తలు తీసుకుంటూ విద్యార్థులతో వెన్నంటే ఉండటంతో యాత్ర సురక్షితంగా, క్రమబద్ధంగా సాగింది.ఈ పర్యటన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస, సామాజిక బాధ్యతను పెంచిందని మండల విద్యాధికారి రమేష్, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల అంకితభావంతో ఈ విజ్ఞాన విహారం విద్యార్థులకు స్ఫూర్తిదాయక అనుభవంగా నిలిచిందని వారు ప్రశంసించారు.

# పాలెం వెంకన్న సేవలో తరిస్తున్న జున్న శేఖర్ రెడ్డి...

## అన్నదాత సుఖీభవ' అంటూ భక్తుల దీవెనలు...



నాగర్ కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 25:** నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన జున్న శేఖర్ రెడ్డి గత పదేళ్లుగా పాలెం అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో అన్నదాన సేవలను నిరంతరంగా కొనసాగిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. సేవే పరమావధిగా భావిస్తూ, వెంకన్న సేవలో తరించడమే జీవిత లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆయన ప్రతి ఏడాది ఉత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులకు మూడు పూటలా అన్నదానం ఏర్పాటు చేస్తూ 'అన్నదాత సుఖీభవ' అనే దీవెనలు అందుకుంటున్నారు.చిన్నతనంలోనే తల్లిదండ్రుల సమక్షంలో పాలెం వెంకన్న సన్నిధిలో పుట్టు వెంట్రుకలు తీసిన నాటి నుంచి ఇప్పటివరకు నిరంతరం స్వామి దర్శనం చేసుకుంటూ వస్తున్న జున్న శేఖర్ రెడ్డి, వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించినప్పటికీ తల్లి దండ్రులు చూపిన భక్తి మార్గాన్ని వదలకుండా ముందుకు సాగుతున్నారు. జున్న సోలార్ ప్లాంట్ పేరుతో పరిశ్రమలను స్థాపించి వందలాదిమందికి ఉపాధి కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సోలార్ ఇండస్ట్రీ, ఆయిల్ కాటన్ మిల్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి చేరుకున్నానంటే అందుకు పాలెం వెంకన్న ఆశీస్సులే కారణమని ఆయన చెబుతున్నారు. సౌమ్యుడు, మృదుస్వభావిగా పేరు పొందిన శేఖర్ రెడ్డి ఎక్కడ ఉన్నా, ఏ రంగంలో పనిచేసినా సేవా దృక్పథంతో అహర్నిశలు శ్రమిస్తున్నారు. గతంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో దేవాలయ రూపురేఖలను మార్చి, కళ్యాణ మండపాన్ని సుందరీకరించి భక్తుల రాకను విశేషంగా పెంచడంలో కీలక పాత్ర పోషించారు. మాజీ ఎంపీపీ పుప్పాల శ్రీనివాస్ గౌడ్ ప్రోత్సాహంతో పాలెం గ్రామంలో వెంకన్న సేవలను ప్రారంభించామని ఆయన గుర్తు చేసుకున్నారు.తాను సంపాదిస్తున్న ఆదాయంలో స్వామి సన్నిధిలో ఖర్చు పెట్టేందుకు ఎప్పుడూ వెనుకాడనని, రాజకీయాలకు అతీతంగా గుడి అభివృద్ధిలో భాగస్వామిగా నిలవడానికి సిద్ధంగా ఉంటానని శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకు అన్నదానం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పాలెం గ్రామంలోని అలివేలు మంగ సమేత వెంకటేశ్వర దేవాలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. రెండవ తిరుపతిగా పేరొందిన పాలెం వెంకన్న క్షేత్రం తన ప్రాశస్తిని కొనసాగించేలా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, గ్రామ ప్రజలు, పెద్దలు చూపుతున్న ఆదరాభిమానాల వల్లే తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించగలుగుతున్నానని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లో విజయం సాధిస్తూ ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న జున్న శేఖర్ రెడ్డిని 'అన్నదాత సుఖీభవ' అంటూ భక్తులు దీవిస్తూ, ఎల్లకాలం వెంకన్న ఆశీస్సులు ఆయనపై ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

# బ్రహ్మోత్సవాల్లో పార్టీలకతీతంగా గ్రామ పెద్దల ఐక్యత...



నాగర్‌కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 25:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ విభేదాలతో పరస్పరం విమర్శలు చేసుకున్న గ్రామ పెద్దలంతా, ఈ ఉత్సవాల్లో పార్టీలకతీతంగా కలిసికట్టుగా పాల్గొనడం విశేషంగా కనిపించింది. రాజకీయాలకు అతీతంగా భక్తి భావనతో ఒకే వేదికపై కూర్చొని ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించడం గ్రామస్థులను ఆకట్టుకుంది.ఆదివారం రథోత్సవం సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన నాయకులు ఎలాంటి తారతమ్యాలు లేకుండా కలిసి కూర్చుని స్వామివారి సేవలో పాల్గొన్నారు.స్వామి వారికి సమర్పించే తులాభారం వద్ద, స్వామిఅమ్మవార్ల వస్త్రాల విక్రయ కౌంటర్ వద్ద కూడా అందరూ కలిసిమెలిసి పాల్గొనడం ఉత్సవ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చింది.ఈ కార్యక్రమంలో ప్రస్తుత గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ సర్పంచ్ గోవిందు నాగరాజు, బీఎస్పీ జిల్లా నాయకులు బోనాసి రామచందర్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ విష్ణుమూర్తి, కాశిరెడ్డి చంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, కుమ్మరి స్వామి, ఐల రవీందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు ఒకే చోట ఉండి ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. గ్రామ అభివృద్ధి, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలసి ముందుకు సాగాలనే సందేశాన్ని పాలెం గ్రామ బ్రహ్మోత్సవాలు స్పష్టంగా చాటుతున్నాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# పాలెంలో కనుల పండుగగా వెంకన్న బ్రహ్మోత్సవాలు...





నాగర్‌కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 25:** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో వెలసిన శ్రీ అల్మేరల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శోభాయానంగా, భక్తుల సందడితో వైభవంగా కొనసాగుతున్నాయి. రథసప్తమి సందర్భంగా ఆదివారం స్వామివారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, వెంకన్న జాతర కనుల పండుగగా మారింది.తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు, రథసప్తమి సందర్భంగా ప్రత్యేక హోమాలు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. స్వామివారిని వివిధ వాహన సేవలపై భక్తులకు దర్శనమిచ్చి, నిత్య కైంకర్యాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ముడుపులు, తులాభారం సమర్పించి స్వామివారి కృపను కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులచే సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ దేవాలయ చైర్మన్ జున్నా శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద పంపిణీని అన్ని రోజులు ఏర్పాటు చేసి భక్తుల ప్రశంసలు పొందారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, కార్యనిర్వహణాధికారి సీ.హెచ్. రంగారావు పర్యవేక్షణ వహించారు. కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గాడి సురేందర్, మాజీ మండల అధ్యక్షులు పి. శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, అర్చకులు శుక్లా, జయంత్, అరవింద్, చక్రపాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే ఆలయ సిబ్బంది ఆర్. శివకుమార్, బాబయ్య, గోవింద, జగదీష్, ఐల రవీందర్ రెడ్డి, సొప్పరి బాలస్వామి, కాశిరెడ్డి చంద్రారెడ్డి, బుర్రి సుదర్శన్ రెడ్డి, కొంకలి మధు తదితరులు సేవలందించారు. వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, మహిళలు, చిన్నారులు వేలాదిగా పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశారు.

# ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు..

## ఘనంగా జాతీయ ఓటర్స్ డే వేడుకలు...






నాగర్‌కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 25:** ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం ఓటు హక్కేనని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్స్ డే సందర్భంగా బిజినపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునిరుద్దీన్, డిప్యూటీ తహసిల్దార్ రవికుమార్, మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ శర్మలు పాల్గొన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఓటు ప్రాముఖ్యతపై అధికారులు ప్రసంగించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అమూల్యమైన హక్కుల్లో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే ప్రధాన ఆయుధం ఓటేనని వారు స్పష్టం చేశారు.ప్రతి సంవత్సరం జనవరి 25ను జాతీయ ఓటర్స్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మండల కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు ప్రత్యేకంగా కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం హక్కు మాత్రమే కాకుండా ఒక గొప్ప బాధ్యత కూడా అని వక్తలు గుర్తు చేశారు. డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. ఓటు ద్వారా మాత్రమే మంచి పాలన సాధ్యమవుతుందని, ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఓటే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, స్వేచ్ఛ, న్యాయం కాపాడడంలో ఎన్నికల కమిషన్ పాత్రను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల శాతం పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్స్ డే సందర్భంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటామని ప్రతిజ్ఞలు చేశారు. ప్రతి ఎన్నికలో నిర్లక్ష్యం వహించకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల చైతన్యంతోనే బలమైన ప్రజాస్వామ్యం నిర్మితమవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ ఓటర్స్ డే వేడుకలను విజయవంతం చేశారు.

# దేశానికి ఉక్కు కవచం..

76 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న భారత రాజ్యాంగం భారతీయులందరికీ ఆత్మ వంటిది. దేశ స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ రచన పూర్తయి 1950 జనవరి 26 నుండి అమల్లోకి తెచ్చుకున్నాం. సుదీర్ఘకాలం భారత రాజ్యాంగం చెక్కుచెదరకుండా దృఢంగా భారతదేశాన్ని ఉక్కు కవచంగా కాపాడగ లిగింది.

## దేశానికి ఉక్కు కవచం..

76 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న భారత రాజ్యాంగం భారతీయులందరికీ ఆత్మ వంటిది. దేశ స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ రచన పూర్తయి 1950 జనవరి 26 నుండి అమల్లోకి తెచ్చుకున్నాం. సుదీర్ఘకాలం భారత రాజ్యాంగం చెక్కుచెదరకుండా దృఢంగా భారతదేశాన్ని ఉక్కు కవచంగా కాపాడగ లిగింది. మన రాజ్యాంగం ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిల బడుతుంది.

## పౌరులకు హెచ్చరిక..

రాజ్యాంగ నిర్మాణ సభ చివరి సమావేశంలో రచన సంఘం అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నవంబర్ 25, 1949న చారిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. 'రాజ్యాంగం ఎంత మంచిదైనప్పటికీ దాన్ని అమలు చేయవలసిన వారు చెడువారైతే చెడ్డ రాజ్యాంగంగా మారే అవకాశం ఉంది. అదే విధంగా ఎంత చెడ్డ రాజ్యాంగమైనా సరే దాన్ని అమలు చేసేవారు మంచివారైనప్పుడు మంచి రాజ్యాంగంగా మారే అవకాశం కూడా ఉంది' అని తన ప్రసంగంలో తెలియచేశారు. అలాగే '1950 జనవరి 26న మనం పరస్పర వైరుధ్యాలలో అడుగుపెడుతున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది. కానీ సామాజిక ఆర్థిక రంగాల్లో అసమానతలు ఉంటాయి. రాజకీయాలలో మనం ఒక మనిషికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ అని గుర్తిస్తాం. కానీ ఒక వ్యక్తికి ఒకే విలువ అనే సూత్రాన్ని మాత్రం పాటించబోం. ఎన్నాళ్లు ఈ విధంగా వైరుధ్యాల మధ్య మనం జీవించాలి' అని అంబేద్కర్ ప్రశ్నించారు. 'వీలైనంత త్వరగా ఈ వైరుధ్యాలను మనం తొలగించుకోవాలి. లేకపోతే మనం ఈ రాజ్యాంగ సభ ద్వారా నిర్మించుకున్న ఈ రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని అసమానతలకు గురైన వారు పేల్చి వేస్తారు' అని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్యానికి చిరునామా..

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్రం పొందిన అనేక ఆసియా, ఆఫ్రికా ఖండాల దేశాలలో భారతదేశం అగ్రగామిగా నిలబడిందనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజ్యాంగం ఆవిర్భవించిన మొదటి రెండున్నర దశాబ్దాలలో ఈ రాజ్యాంగం బూర్జువా రాజ్యాంగం అని తిరస్కరించిన అనేక సమూహాలు ఉన్నాయి. మరోవైపు ఈ రాజ్యాంగంలో స్వదేశీయత లోపించిందని అసహనం వ్యక్తం చేసిన వర్గాలు ఉన్నాయి. అయినప్పటికీ భారతదేశంలో జమీందారీ వ్యవస్థ, రాజభరణాలు రద్దు చేయబడ్డాయి. అనేక భూసంస్కరణలు జరిగాయి. భూమిలేని పేదలకు భూ పంపిణీ చేయబడింది. బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన సమసమాజ నిర్మాణం కోసం దారులు వేయ బడ్డాయి. మరోవైపు ప్రపంచీకరణ ముంచుకొస్తున్నప్పుడు సర ళీకృత ఆర్థిక విధానాలు ముందుకొచ్చాయి. ప్రపంచంతో భారతదేశం పోటీ పడగలుగుతుంది. బ్రిటిష్ వలస పాలన అందించిన ఆంగ్ల భాష నేడు భారతీయులను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెడుతుంది.

## గణతంత్ర దేశమా! వర్ధిల్లు!!

రాజ్యాంగ నిర్మాతలు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగం నాలుగో భాగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. గడచిన ఏడున్నర దశాబ్దాలలో అనేకమైనటువంటి నిబంధనలు చట్టరూపం దాల్చాయి. విద్య హక్కు చట్టం లాంటివి ప్రాథమిక హక్కులలో చేర్చబడ్డాయి. ఆదేశిక సూత్రాల అమలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ఎస్సీ ,ఎస్టీ ,ఓబీసీలు, స్త్రీలకు సంబంధించిన రిజర్వేషన్ల విషయంలో అనేక చట్టాలు చేయబడ్డాయి. ఈనాటికి పలు సమూహాలు తమ తమ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకోవడానికి ప్రత్యేక హక్కులను డిమాండ్ చేస్తున్నాయి.

# బ్రహ్మోత్సవాల్లో అమ్మ అయ్య వార్ల వస్త్రాలకు భక్తుల తాకిడి...



నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 25:** బ్రహ్మోత్సవాలలో భాగంగా అలివేలు మంగ వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్లకు సమర్పించిన వస్త్రాల అమ్మకం భక్తుల విశేష ఆకర్షణగా నిలుస్తోంది. గత ఏడాది కాలంలో భక్తులు స్వామి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో సమర్పించిన పట్టుచీరలు, పట్టు పంచలను ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విక్రయ కౌంటర్ ద్వారా ఉత్సవాల ప్రారంభం నుంచే అమ్మకానికి ఉంచింది. విశేష పూజలు, అభిషేకాలు పొందిన ఈ పునీత వస్త్రాలను తమ ఇంటికి తీసుకెళ్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, కష్టాలు తొలగి సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని భక్తులు గాఢ విశ్వాసంతో కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన వస్త్రాల విక్రయ స్టాల్‌కు రోజురోజుకు గిరాకీ పెరుగుతోంది. సరసమైన ధరల వస్త్రాల నుంచి విలువైన పట్టువస్త్రాల వరకు విక్రయానికి అందుబాటులో ఉంచడంతో భక్తులు తమకు నచ్చిన వస్త్రాన్ని దక్కించుకునేందుకు క్యూలైన్లలో ఓర్పుతో ఎదురుచూస్తున్నారు.ఆలయ ధర్మకర్త విష్ణుమూర్తి, కార్యనిర్వహణాధికారి చిలుకూరి రంగారావు, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గోవిందు శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయిని గోవిందు కొండమ్మ, పద్మశాలి దేవేందర్లు వస్త్రాల విక్రయ ఏర్పాట్లలో విశేషంగా కృషి చేస్తున్నారు. భక్తులు సమర్పించిన వస్త్రాలను ఆలయ ఆదాయం పెంపొందించడమే కాక భోగభాగ్యాల కోసం విక్రయిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొప్పరి బాలస్వామి, పెద్ద కుర్మయ్య, గోవిందు జగదీశ్వర్, ఐల రవీందర్ రెడ్డి, కాశిరెడ్డి చంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, బండారి జగదీశ్వర్ తదితరులు దేవాలయ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సహకరిస్తున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో కళకళలాడుతోంది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com